₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 05

మార్చి 1-15, 2019



## ఉద్యోగస్వామ్య పాలన నుంచి 'ప్రజల భాగస్వామ్య' పాలన లోకి..




# అవకాశాలను జారవిడుస్తున్న పాలకులే భారత్‌కు శాపం



## 2019 ఎన్నికలు - ప్రజల మేనిఫెస్టో

# విజయనగరం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలను సాధించిన లోక్‌సత్తా

విజయనగరం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలన్న లోక్‌సత్తా పార్టీ కృషి ఫలించింది. ఎట్టకేలకు జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైంది విజయనగరం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల కోసం, వైద్య సేవల మెరుగుదల కోసం కొన్నేళ్లుగా కృషి చేస్తున్న లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అభినందించారు. జనహితం కోసం ఇలాంటి కృషిని ఇంకా విస్తరించాలని సూచించారు. జిల్లాలో వైద్య కళాశాల కోసం బాబ్జీ నిర్వహించిన కొన్ని కార్యక్రమాలివి.















జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

మార్చి 1-15, 2019 సంపుటి - 10 సంచిక - 05

## లోపలి పేజీల్లో...


ప్రభుత్వాలు 24 గంటలూ నిద్రపోయినా ........... 5

ఒక వేలు అమెరికా వైపు చూపితే నాలుగు......... 8

సర్పంచ్ ప్రాధాన్యత పెంచిన కొత్త పంచాయతీ... 11

రాష్ట్ర బడ్జెట్‌లోనే పంచాయతీలకు నిధుల్ని......... 13

ఉద్యోగస్వామ్య పాలన నుంచి ప్రజల.............. 15

2019 ఎన్నికలకు ప్రజల మేనిఫెస్టోని విడుదల... 20

వెనుకబడిన ప్రాంతాలకు కేంద్రం మొండిచెయ్యి....24


బస్సులు నడపటమే చేతగానివాళ్లు సరైన పాలన. 26

ఓటుపై మీ మాట చెప్పండి! '-నిర్బంధ ఓటింగ్'...... 27

ఎన్నికల ఫార్ములా... ఏపీ బడ్జెట్ 2019 ............ 29

గెలిపించిన పథకాల ఫార్ములాతోనే తెలంగాణ..... 32


## కార్టూన్ కార్నర్




వచ్చే ఎన్నికల్లో ఖర్చు రికార్డు స్థాయిలో ఉంటుందట... ఆ మేరకు నిధులు సమకూర్చుకోవాలి. అన్నీ రెండువేల నోట్లు ఉండేట్టు చూడు.


### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి.కుటుంబరావు


### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


FOLLOW ME ON
twitter
Friends, Interacting with youngsters always gives me immense pleasure. You can tweet your suggestions , ideas , queries to :
@JP_LOKSATTA
I will try to respond to as many as possible
DR.JAYAPRAKASH NARAYAN, FOUNDER, LOKSATTA

## ప్రభుత్వాలు 24 గంటలూ నిద్రపోయినా జనజీవనం యధాతథంగానే కొనసాగుతుంది,
# అవకాశాల్ని అందిపుచ్చుకునే పాలన కావాలి: 'హార్వర్డ్ ఇండియా'లో జేపీ




మనదేశంలో ప్రభుత్వాలు రోజుకు 24 గంటలూ, సంవత్సరంలో 365 రోజులూ నిద్రపోయినా జనజీవనం ఇప్పుడున్నట్లే యధాతథంగా కొనసాగుతుందని, కొన్ని రంగాల్లో ఇంకా మెరుగ్గా కూడా ప్రజలు ఫలితాలను సాధించగలరని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 1949-1979-2019లను పోల్చిచూసుకుంటే దేశంలో కొంత అభివృద్ధి కచ్చితంగా కనిపిస్తుందని, కానీ అదే సమయంలో.. 'ఒక వ్యక్తిగా నేను నిన్నటికన్నా మెరుగ్గా ఉన్నానా, నేను ఇంకా మెరుగ్గా ఉండొచ్చా, నాతోటివారితో సమానంగా సామర్థ్యాన్ని వికసింప చేసుకుని ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు నాకు ఉన్నాయా?'- అని దేశంలోని ఒక సగటు పౌరుడు బేరీజు వేసి చూసుకుంటే.. భారత్‌లోని పాలకులు అనేక కీలకావకాశాల్ని జారవిడిచినట్లు, ఇప్పటికీ జారవిడుస్తున్నట్లు అర్థమవుతుందని అన్నారు.

**అమెరికా హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని హార్వర్డ్ కెన్నడీ స్కూల్‌లో జరిగిన 'హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్స్ 2019' కార్యక్రమంలో 'సంధి దశలో ఇండియా - దిశను మార్చే ఎజెండా'పై జేపీ ప్రసంగించారు. ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, ఎంకెఎస్ఎస్ వ్యవస్థాపకురాలు అరుణా రాయ్, హిందూస్థాన్ యూనిలివర్ సీఎండీ సంజీవ్ మెహతా తదితరులు వేదికను పంచుకున్నారు.**

**ఈవేళ్టి భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లపై మాట్లాడేందుకు, చర్చించేందుకు, సమన్వయం చేసుకునేందుకు ఏటా నిర్వహించే ప్రపంచస్థాయి సమావేశాలలో హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్స్ ఒకటి. అమెరికాలోనైతే ఈ అంశానికి సంబంధించిన అతి పెద్ద వార్షిక సమావేశం. తాజాగా జరుగుతున్న ఇండియా కాన్ఫరెన్స్ 16వ వార్షికోత్సవంలో.. భారత్‌లోని పరిస్థితులను పట్టించుకోవాలనుకునే దాదాపు 1000 మంది నాయకులు, మేధావులు, విద్యార్థులు, యువ వృత్తినిపుణులు పాల్గొన్నారు.**

జేపీ మాట్లాడుతూ, ప్రతి ఐదు, పదేళ్లకు కొత్తపుంతలు తొక్కే అవకాశం దేశానికి లభిస్తోందని, కానీ 1991లోని సంస్కరణలు అందించిన అవకాశాల నుంచి 2014లో ఇచ్చిన హామీల వరకూ చాలా అవకాశాల్ని జారవిడిచారని అన్నారు. ఈ వైఫల్యంలో వామపక్ష, వామపక్షేతర, హిందూ, ముస్లిం అనే తేడాలే లేవన్నారు. ప్రస్తుత సంధిదశలో కూడా పూర్తిస్థాయి ప్రయత్నం చేయకుండా.. మౌలిక వసతులు, ఇతర సదుపాయాల్లో స్వల్ప చర్యలు, జీఎస్‌టి వంటి కొన్ని మార్పులకే పాలకులు పరిమితమవు తున్నారన్నారు. మనకున్న కుటుంబ వ్యవస్థ, 21వ శతాబ్దపు సాంకేతిక పరిజ్ఞానం, కదం తొక్కే యువ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అనే సానుకూల తలకు తగ్గ అభివృద్ధిని సాధించ లేకపోతున్నారన్నారు.

1991 నుంచి ప్రపంచ వ్యాప్తంగానూ, స్వదేశంలోనూ భారత్‌ను ప్రభావం చూపిన కొన్ని పరిణామాలు, ఎదురవుతున్న సవాళ్లను జేపీ ఈ సందర్భంగా ప్రస్తావించారు.

1991 తర్వాత వాణిజ్య, వలన అవరోధాలు తొలగి

అవకాశాలు పెరిగాయని, కానీ ఈవేళ పరిస్థితులు విరుద్ధంగా మారుతున్నాయని జేపీ అన్నారు. మరోవైపు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నకొద్దీ అనూహ్య స్థాయిలో విస్తరిస్తోందని జేపీ అన్నారు. రాబోయే 10-20 ఏళ్లలో వచ్చే సాంకేతిక మార్పులు భారతదేశ గతిని పెద్దఎత్తున ప్రభావితం చేయనున్నాయన్నారు. ఇదేసమయంలో తాత్కాలిక అవసరాల్ని, దీర్ఘకాలిక లక్ష్యాల్ని సమన్వయం చేయటంలో మన ప్రభుత్వాలు విఫలమవుతూ వస్తున్నా యన్నారు. మన దేశంలో కుటుంబాలు పొదుపు చేస్తూ తమ పిల్లల భవిష్యత్తు కోసం వనరులను కాపాడేందుకు ప్రయత్నిస్తుంటాయని, హిందూ, ముస్లిం తేడా లేకుండా మనదేశంలో తమ బిడ్డల భవిష్యత్తే తమ భవిష్యత్తు అని ప్రతి తల్లీతండ్రీ అనుకుంటారని, కానీ ఆ దృష్టి పాలకులకు మాత్రం లేకుండా పోయిందన్నారు. నిరుపేదలకు, ఏ అవకాశాల్నీ అందుకోలేనివారికి అందించాల్సిన ఉచితాల్ని, సహాయాల్ని ప్రజల సొమ్ముతో అందరికీ విచక్షణారహితంగా పంచుతూ ఓట్లు సంపాదించుకునే రాజకీయ క్రీడ పోటాపోటీగా కొనసాగుతోందన్నారు. వీటికితోడు, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మింగేస్తూ చైనా విస్తరిస్తున్న తీరు భారత్‌కు ప్రమాదకరంగా మారుతోందన్నారు. మనం పైకి ఎన్ని చెప్పుకుంటున్నా, గతంలో అనేక అవకాశాల్ని జారవిడటం వల్ల చైనాతో పోటీ పడే అవకాశాల్ని కోల్పోయామన్నారు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 200 బిలియన్ డాలర్లు దాటిన 49 దేశాల మధ్య




ప్రజాస్వామ్య పీఠం అధ్యయనం చేస్తే.. పనికొచ్చే ప్రతి ప్రమాణంలోనూ భారతదేశం చివరి నాలుగైదు స్థానాల్లో ఉందన్నారు. జనాభా వల్ల మనం ఆర్థికంగా అంకెల్లో ఘనంగా బ్రిటన్, జపాన్‌ను మించి పోతున్నట్లు కనిపిస్తున్నామని, సరాసరిన చూస్తే మాత్రం పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియాల సరసన ఉన్నామన్నారు. ఒకప్పుడు మనకంటే వెనుకబడిన చైనా, మలేషియా, వియత్నాం, దక్షిణాఫ్రికా, మెక్సికో దేశాలు ఈ మౌలికాంశాలను పునాదిగా చేసుకుని వేగంగా ఎదుగుతున్నా యన్నారు. ఇంకా ఎంతో చేయగల సత్తా మనకున్నా కూడా, అందుకోసం ప్రయత్నించకుండా విఫలమవుతున్నామన్నారు.

### హుస్నాబాద్, గుడివాడల్లో ఏం చేయాలో ఢిల్లీ నుంచి చెబుతారా?

మరోపక్క మితిమీరిన కేంద్రీకృత పాలన దేశంలో ఎదిగే అవకాశాలకు పెద్ద అవరోధంగా మారిందని జేపీ స్పష్టం చేశారు.. 130 కోట్ల జనాభా గల దేశంలో రాజస్తాన్‌లో, హర్యానాలో, తెలంగాణలోని హుస్నాబాద్‌లో, ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడలో ఏం చేయాలో ఢిల్లీలోని ఓ సంయుక్త కార్యదర్శి ఆలోచించి ఆదేశాలు జారీ చేయటం హాస్యాస్పదమన్నారు. దేశ ఏకత అంటే, మూస పోసినట్లుండే ఏకరూపత కాదన్నారు. హార్వర్డ్ ఇండియా సదస్సుకు హాజరైన అసదుద్దీన్ ఒవైసీ, అరుణా రాయ్, సంజీవ్ మెహతా తదితరులు భిన్నాభిప్రాయాల్ని వ్యక్తం చేసినా వారంతా దేశ ఐక్యత పట్ల, సామరస్యత పట్ల తిరుగులేని నిబద్ధత కలవారన్నారు.

### జమ్మూ కాశ్మీర్‌లోనూ కర్ణాటకలోలానే వ్యవహరించారు

జమ్మూ కాశ్మీర్ గురించి ఇప్పుడున్న పరిస్థితుల్లో తాను ప్రస్తావించదలచుకోకపోయినా, సభలో లేవనెత్తారు కాబట్టి మాట్లాడుతున్నానని, తనకు తెలిసి నాలుగు పెద్ద అవకాశాల్ని అక్కడ జారవిడిచారని జేపీ అన్నారు. 2011లో మిలిటెంట్ల హుకుంను ధిక్కరించి మరీ 78 శాతం మంది ప్రజలు స్థానిక ఎన్నికల్లో ఓటు వేశారని, 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో తీర్పు ద్వారా మరో చక్కటి అవకాశం లభించిందని అన్నారు. కానీ కర్ణాటకలోలా ఎంతమంది ఎమ్మెల్యేలున్నారు, ఎంతమందిని లాక్కోవచ్చు అనే రీతిలోనే రాజకీయం చేసి ఆ అవకాశాన్నీ

జారవిడిచారన్నారు. పాకిస్తాన్‌తో, తీవ్రవాదులతో, ఇతర కొన్ని దేశాలతో సమస్యలు ఉన్నా కూడా.. స్థానిక ప్రజల హృదయాలను గెలుచుకోవటం కీలకమని, ఇదే విషయం ఇటీవలి దాడిలో కూడా స్పష్టమైందని అన్నారు. స్థానిక పరిస్థితులకనుగుణంగా సరైన నిర్ణయాలను తీసుకుని అమలు చేసుకోగలిగేలా ఫెడరలిజాన్ని మరింత విస్తరించాలన్నారు. ప్రజలు రాష్ట్రంలోని పాలకుల్ని, పార్టీల్ని చూసి ఓట్లు వేస్తుంటే, స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు ఎలా జరగాలో కూడా రాజ్యాంగంలో పెట్టి శాసించటం తగదన్నారు. అమెరికాలో ప్రతి రాష్ట్రానికీ సొంత పద్ధతులను అనుసరించే స్వేచ్ఛ ఉందని, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి చోట రాష్ట్రాలకు సొంత రాజ్యాంగ పద్ధతులున్నాయన్నారు. ఏకీకృత దేశంగా పేరొందిన బ్రిటన్‌లో కూడా స్కాట్లాండ్, వేల్స్‌కు ప్రత్యేక చట్టవ్యవస్థ, ఎన్నికల పద్ధతులు ఉన్నాయన్నారు. లండన్ మేయర్‌ను ప్రత్యక్షంగా ఎన్నుకుంటారన్నారు. మనదేశంలో రాష్ట్రాల్లో చదువు, భూసేకరణ, స్థానిక పాలన వంటివన్నీ కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉండటం వల్ల ప్రజలకు సేవలు సక్రమంగా అందకపోవటంతోపాటు కొత్తగా నాయకులు తయారవటం లేదన్నారు.

## ఫెడరలిజాన్ని బలోపేతం చేయాలి .. వేయి పూలు వికసించనివ్వాలి

వేయి పూలు వికసించాల్సి ఉండగా, 1990ల తర్వాత స్థానిక ప్రభుత్వాల నుంచి ఒక్కరంటే ఒక్కరు చెప్పుకోదగ్గ నాయకుడు, నాయకురాలు తయారవలేదని జేపీ అన్నారు. రాష్ట్రాల్ని, స్థానిక ప్రభుత్వాల్ని, నగరాల్ని కేంద్రీకృత పాలన నుంచి విముక్తి చేసి దేశ సమైక్యత, సమగ్రత పరిధిలో స్వయంప్రతిపత్తితో వ్యవహరించేలా చేయాలన్నారు. దేశం కోసం ఏదైనా చేద్దామనుకుంటున్నాను, ఏం చేయాలి.. అని తనను ఈవేళ చాలామంది యువత అడుగుతున్నారని, అలాంటివారి సేవల్ని, సామర్థ్యాన్ని వినియోగించుకోవాలంటే ఫెడరలిజాన్ని బలోపేతం చేస్తూ అధికారాన్ని స్థానిక ప్రభుత్వాల వరకూ విస్తరించటమే మార్గమన్నారు. పదేళ్ల తర్వాత మరో అవకాశాన్ని జారవిడుచుకున్నామని ఆవేదన చెందే పరిస్థితి రాకుండా అప్రమత్తమవ్వాలన్నారు.

## విభజన హామీలపై రాజకీయ పరిష్కారం సాధ్యమవుతుందనే ఆశిస్తున్నాను

మరో కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ.. వందల ఏళ్ల క్రితం ఏర్పడిన హార్వర్డ్, కేంబ్రిడ్జి వంటి విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన కృషి వల్ల ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు బతికిబట్ట కట్టగలిగారని, ఈ విశ్వవిద్యాలయాలు 'సత్యం, తర్కం, ఆ రెంటి ఆధారంగా భవిష్యత్ దర్శనం' అనే సూత్రాల మీదే తమ కృషిని చేశాయని జేపీ అన్నారు. ఈరకంగానే ప్రజాస్వామ్య పీఠం చొరవతో స్వతంత్ర నిపుణులు కృషి చేసి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన విభజన హామీల ప్రస్తుత స్థితిని నిర్ధారించారన్నారు. చిన్నచిన్న లెక్కలు మినహాయించి దాదాపు పూర్తిస్థాయి గణాంకాల ఆధారంగా వాస్తవాలతో, వేలెత్తి చూపలేని విధంగా, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ ఈ మదింపు, నిర్ధారణలు జరిగాయన్నారు. వివిధ హామీల కింద ఇంకా రూ.86,000 కోట్లు రావాల్సి ఉండటంతోపాటు పోలవరం రెండోదశ, అమరావతికి కూడా నిధుల్ని ఇవ్వాల్సి ఉందని తమ నివేదికలో తేలిందని, జాతీయస్థాయిలో సుప్రసిద్ధ తెలుగేతర నిపుణులు కూడా దీనికి ఆమోదముద్ర వేశారన్నారు. సత్యం ఒక్కటే ఉంటుందని, మీ సత్యం వేరు, మా సత్యం వేరు అంటే అది మతం అవుతుంది తప్ప సత్యం అవదన్నారు. అన్ని రాజకీయ పార్టీలకూ నివేదికను అందించామని, రాబోయే ఎన్నికల్లో ఇది చర్చనీయాంశమై ఆ తర్వాత ఒక రాజకీయ పరిష్కారం సాధ్యమవుతుందని ఆశిస్తున్నామన్నారు. రాజకీయ పరిష్కారం సాధ్యం కాకపోతే స్వతంత్ర నిపుణుల నివేదిక ఆధారంగా న్యాయస్థానం ద్వారా పరిష్కారమే మార్గమన్నారు. యూనియన్ ప్రభుత్వం, రాష్ట్రాల మధ్య వివాదాస్పద సమస్య తలెత్తితే పరిష్కరించే అధికారం సుప్రీంకోర్టుకు ఉంటుందన్నారు.

అందరికీ సాంకేతిక సవాళ్లను తట్టుకునే ప్రపంచస్థాయి విద్య, మంచి ప్రమాణాల ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు, జాప్యాలు లేకుండా 'పౌర సేవల' చట్టం, వికేంద్రీకరణతో స్థానిక సాధికారత, గ్రామాలు-పట్టణాల మధ్య అంతరాన్ని తగ్గిస్తూ వ్యవసాయాన్ని లాభసాటి చేయటం, చట్టబద్ధపాలన.. ఎజెండాతో పునాదుల్ని నిర్మిస్తేనే భారతదేశ సామర్థ్యం పూర్తిస్థాయిలో వికసించి రాష్ట్రాల్లో, దేశంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరతాయని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ✧

# ఒక వేలు అమెరికా వైపు చూపితే.. నాలుగు వేళ్లు మన వైపు చూపుతున్నాయి!




**- ఎ. అన్నపూర్ణ,** కేలిఫోర్నియా

అమెరికాలో అక్రమంగా నివసించే భారతీయ విద్యార్థుల గురించి కొన్ని రోజులుగా మనదేశంలోని మీడియాలో మళ్లీ పెద్దఎత్తున కథనాలు వస్తున్నాయి. అమెరికాదే తప్పు అన్నట్లు ఎక్కువమంది మాట్లాడుతున్నారు. మన విద్యార్థులు అమాయకులు అంటున్నారు. ట్రంప్ కక్ష సాధింపు చర్య అన్నట్లు ఇంకొందరు మాట్లాడుతున్నారు. ఎవరికి నచ్చినట్లు వారు ఆలోచించుకునే స్వేచ్ఛ ఉంది గానీ.. ఈ మొత్తం సంఘటనల్లో ఒక వేలు అమెరికా వైపు చూపుతుంటే, నాలుగు వేళ్లు మన వైపే చూపుతున్నాయన్నది వాస్తవం.

గతంలోనే మన విద్యార్థులు తప్పు చేసి దొరికిపోయారు. అయినా మళ్లీ మళ్లీ ఆ తప్పుల్ని కొనసాగించారు. వీసా గడువు ముగియగానే నిజాయతీగా వెనక్కి ఇండియా వెళ్లిపోవాలని తెలిసి కూడా పొరబాట్లు చేస్తే దాన్ని నేరంగానే పరిగణిస్తారు. ఒక్క తప్పుకి పడే మచ్చ వలన వారు తిరిగి అమెరికా రాలేని పరిస్థితిని తెచ్చుకున్నారు. ఎందుకు మనవారికీ ఖర్మ పట్టింది అని ఆలోచించకుండా.. గుడ్డిగా వారిని వెనుకేసుకొస్తూ, అమాయకులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయటం ఒక దేశంగా, సమాజంగా మన వైఫల్యానికే అద్దం పడుతుంది. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులూ నేరం చేసినట్లే.

నేను ఒక తండ్రీకొడుకు మాట్లాడుకోవడం విన్నాను. తండ్రి కొడుకుతో అన్నాడు. 'ఒరే! నెలకి 2,000 డాలర్లు పంపించాలి. అక్కడ (ఇండియాలో) అప్పులు చాలా ఉన్నాయి. నువ్వు ముష్టి 500 డాలర్లు పంపుతున్నావ్. కోడలిని ఖర్చు తగ్గించుకోమను. నువ్వు కఠినంగా ఉండాలి. నిన్ను అమెరికా ఎందుకు పంపాను? గుర్తుంచుకుని మసలుకో...' అంటూ నీతిబోధ చేశాడు. ఆ కొడుకు సమాధానం చెప్పలేక ఆ... ఊ... అంటున్నాడు. ఆ తర్వాత ఏం జరిగిందో మనకు తెలియదు. అందరికీ తెలిసిన మరో విషయం మనం రెండు సంవత్సరాల క్రితం విన్నాం. 'ఇండియా వచ్చేద్దాం అనుకుంటు న్నాను నాన్నా... ఇక్కడ నాకు బాగా లేదు, చిత్రహింస అనుభవిస్తున్నాను మానసికంగా, శారీరకంగా. అమెరికా మనలాంటి మధ్యతరగతికి స్వర్గం కాదు నాన్నా...' అంటూ ఉత్తరం రాస్తే, ఆ కసాయి తండ్రి 'రావద్దు.. ఎలాగో సర్దుకుపో' అన్నాడని ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఆ యువకుడు. విన్నవారికే హృదయం కలచివేస్తోంది కదా, మరి ఆ తండ్రి... తండ్రేనా? బిడ్డ ఏమైపోయినా తన ధనదాహం తీర్చుకోవాలను కోవటం ఎంత దారుణం! ఇలాంటి తండ్రులు చేతనైతే వారే సంపాదించుకోవాలి. లేదంటే సామాన్యంగా జీవించాలి. పిల్లల్ని బలిచేయకండి.

మోసం చేసింది తోటి ఇండియన్స్ తప్ప అమెరికన్లు కాదు, ట్రంప్ కాదు అని పైన తండ్రి ఉదంతం వంటివి చూస్తే అర్థమైపోతుంది. భారతదేశంలో చట్టాలు వృథా అన్నట్లుంటాయి. అమెరికాలో స్ట్రిక్ట్‌గా ఉంటాయి. అమెరికాను మోసం చేయాలనుకుంటే ఆ దేశస్తులు శిక్షించాలనే చూస్తారు. అది వారి చట్టబద్ధపాలన స్థాయి. మనం చట్టబద్ధ పాలనను నేర్చుకోకుండా, అమెరికాలోకి వచ్చి అక్కడి చట్టబద్ధపాలనను అపహాస్యం చేయబోయి దొరికి పోయాక తెలుగువారమనీ, భారతీయులమనీ మనం గర్వంగా చెప్పుకోగలమా? సిగ్గుతో తలవంచు కోకుండా ఉండగలమా?

అదృష్టవశాత్తు ఈ విషయాలు ఇక్కడ అమెరికాలో న్యూస్‌లోనూ, టీవీ ఛానల్స్‌లోనూ రావు కనుకగానీ, వచ్చి ఉంటే మాలాంటి వాళ్లు ఇతరులతో మాట్లాడ

టానికి, కలిసి పనిచేయటానికి చాలా ఇరకాటమైన పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వచ్చేది. సాటి తెలుగువారి మధ్య కూడా ఇలాంటి అంశాలపై మరీ ఎక్కువగా చర్చించటానికి సిగ్గుపడాల్సి వస్తోంది.

చిన్నా పెద్దా తేడా లేకుండా మనవాళ్లు చేస్తున్న పనుల గురించి నిజం చెబితే హేళన చేస్తున్నామనుకోవచ్చు.. కానీ చెప్పకపోతే సమస్యల్ని ఇంకా ఎక్కువ పెంచుకోవటమే అవుతుంది. ట్రంప్‌కు సంబంధించిన ఇతరత్రా అంశాలెలాఉన్నా, అమెరికా ప్రయోజనాల దృష్ట్యా ఎందరో మేధావులైన భారతీయులకు సముచితంగా పదవులను ఇచ్చారు. మనం మన అవసరాలకి అమెరికా వచ్చి, అవసరం తీరాక అమెరికన్లను చులకనగా చూడటం ఎంతమాత్రం తగదు.

ఇప్పటిదాకా జరిగిన వాటికి మనం కొంతైనా బుద్ధి తెచ్చుకోగలగాలి. నిజాయతీగా వ్యవహరించగలగాలి. చదువు మీద శ్రద్ధ పెట్టి సక్రమ మార్గంలో అమెరికా, ఇతర దేశాలకు వెళ్లటానికి ప్రయత్నించాలి. అమెరికాలో స్థిరపడిన భారతీయులు అవమానకరంగా ఫీలయ్యేలా, అమెరికన్ల నుంచి లజ్జాకర పరిస్థితులను ఎదుర్కొనేలా వ్యవహరించటం తగదు.

ముఖ్యంగా తల్లిదండ్రులు.. అర్హత లేకుండా అమెరికాలో ఉంటున్న పిల్లల్ని స్వచ్ఛందంగా వెనక్కి పిలిపించుకోండి! వారిని అక్కున చేర్చుకుని స్వదేశంలో రాజకీయ, పాలనా ప్రక్షాళన చేసుకుని మీ బిడ్డలకు మంచి భవిష్యత్‌ని ఇవ్వండి. వ్యవస్థ బాగాలేదని నిందిస్తూ అమెరికా పారిపోతే ప్రయోజనం లేదు. బాగు చేసుకోవడం మీ చేతుల్లోనే ఉంది. కష్టకాలంలో ఆదుకుంటాం, మీరు విదేశాలకు వెళ్లండి.. అని చెప్పేవారు ఏమీ చేయలేరు. అది గ్రహించుకోండి. భారత్‌లోనే అవకాశాలు అందించండని పోరాటం చేయండి. 'మనదేశంలోనే అవకాశాలు కల్పిస్తే మా బిడ్డలు విదేశాలకు క్యూకట్టే అవసరం ఎందుకుంటుంది?' అని ప్రశ్నించండి. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ గారు చెప్పిన విషయాలను కాస్త మననుపెట్టి పట్టించుకోండి. మనదేశంలో ప్రతి విద్యార్థి మీదా ప్రభుత్వాలు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వాలే ఒక్కో పాఠశాల విద్యార్థి మీద రూ.50,000 – 60,000 ఖర్చు చేస్తున్నాయని అంచనా. ఆ విద్యార్థులు దేశానికి ఉపయోగపడాలనే ప్రజల పన్నుల డబ్బును అలా ఖర్చు చేస్తున్నారు. అంతే తప్ప, పరాయిదేశాల కోసం కాదు. మరి ఇంత డబ్బును ఖర్చు చేస్తున్నా సరైన చదువు ఎందుకు రావడం లేదు, కొందరు డబ్బున్నవాళ్లు మాత్రం సరైన చదువును కొనుగోలు చేసి అమెరికా వంటి దేశాలకు ఎలా వెళ్లగలుగుతున్నారు, మేం అమెరికా వెళ్లగలిగే స్థాయి చదువుల్ని ఎందుకు పొందలేకపోతున్నాం, అసలు అమెరికా వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే మంచి ప్రమాణాల చదువులు, మంచి ఆదాయావకాశాల్ని ఎందుకు అందించలేకపోతున్నారు?.. అని ప్రభుత్వాల్ని నిలదీయండి. ఉన్నత విద్య కోసం మనవాళ్లు అమెరికా వంటి విదేశాలకు ఏటా వేల కోట్లు ధారపోస్తున్నారు. స్వదేశంలోని విశ్వవిద్యాలయాలను బాగు చేయకుండా, కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు విదేశీ చదువులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. దీన్ని ప్రశ్నించండి.

ఓటుహక్కును, భావప్రకటనా స్వేచ్ఛను ఉపయోగించి ప్రభుత్వాల్ని నిలదీయకుండా, దూరపు ఒయాసిస్సుల వైపు వెనుకాముందూ ఆలోచించకుండా పరుగులు పెట్టటం మంచిది కాదు. భారతదేశంలో మంచి మార్పుల్ని ఎలా సాధించుకోవాలో లోక్‌సత్తా స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ని అందిస్తోంది. దేశం నుంచి పలాయనం చిత్తగించటం ద్వారా ఎల్లకాలం సుఖపడలేమని మనం గుర్తిస్తే.. ఇలాంటి విధానాల గురించి అవగాహన పెంచుకుని, దేశ పురోగమనంలో భాగస్వాములం కాగలం.

అలాగే మనదేశంలో మంచి చదువులు చదువుకుని, ఉన్నత స్థాయిలో స్థిరపడే అవకాశాలున్నవారికి కూడా నాదో విజ్ఞప్తి. మీరు అమెరికాకు వచ్చి ఆర్జించుకోవటం మీద కన్నా, మనదేశాన్ని బాగు చేయటం మీదే దృష్టి పెట్టండి. రెక్కాడితే డొక్కాడని సామాన్యులతో పెద్ద మార్పులు రావటం అరుదుగా జరుగుతుంది. ఒకవేళ వచ్చినా వాటి వెనుక ఎంతో సమయం వృథా, అపార నష్టం ఉంటాయి. మనదేశంలో స్వతంత్ర పోరాటం కావచ్చు, అమెరికాలో నల్లజాతీయుల విముక్తి కావచ్చు.. ఉన్నత విద్యావంతులు, సంపన్నులు, తెల్లవారితోనే సాధ్యమైంది. అందుకే భారత్‌లోని సంపన్నులు, ఉన్నత విద్యావంతులు అమెరికా మంత్రాన్ని జపించటం ఆపి స్వదేశాన్ని బాగు చేయటం మీద దృష్టి పెడితే కోట్లాదిమందికి మేలు చేసినవారవుతారు.

మనకు ఐదువేల సంవత్సరాల అవిచ్ఛిన్న సంస్కృతి ఉందని మనం రోజూ రాజకీయ నాయకుల నుంచి, మతగురువుల నుంచి వింటూంటాం. కానీ అమెరికాలో మన వాళ్లు మోసాలకు ఎందుకు పాల్పడుతున్నారు? అనే ప్రశ్నకు సమాధానం వెతకటానికి మాత్రం మన నేతలు, గురువులు

చొరవ చూపరు. మన వద్ద సరైన వ్యవస్థలు ఉంటే, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి ఏర్పాట్ల ద్వారా అందరికీ ఎదిగే అవకాశాలు అందుబాటులో ఉంటే.. మనలోని కోట్లాది సామాన్యులు అమెరికాకే ఆదర్శప్రాయంగా పాఠాలు చెప్పగలరు. దేశాన్ని మార్చే బాధ్యతను సొంత వనరులున్నవారు తీసుకుంటేనే ఇలా మిగతావారంతా వారిని అనుసరించి మార్పులో భాగస్వాములు కాగలరు. ఇది జేపీ ఒక్కరే, లోక్‌సత్తా ఒక్కటే చేస్తే అయ్యే పనికాదు. ఇందులో అందరూ తమ వంతుగా పాలుపంచుకోవాలి.

అమెరికాలో స్థిరపడినవారు కూడా కష్టాలు పడుతూనే ఉన్నారు. ఇవి ఒక్కొక్కరికీ ఒకోలా ఉన్నాయి. దిగితేనే లోతు తెలిసేది అన్నట్లు వీరి అవస్థలు ఉన్నాయి. తీరా వచ్చాక ఏం చేస్తామన్నట్లు, వీరు సర్దుకుపోతుంటారు. కొన్ని కోల్పోతారు. అవి వెంటనే తెలియదు. కాలక్రమేణా తెలిసివస్తాయి. అప్పుడిక చేసేది ఏమీ ఉండదని తెలుసుకుంటారు. కన్నవారితోనే, సొంతవారితోనే సంబంధాలు తెగిపోతుంటాయి. ఆకర్షణ వలయంలో జీవితాలే కోల్పోయినవారు ఉన్నారు. ఒక్కొక్కరిదీ ఒకో విషాదగాథ. అందరూ అలా ఉండక పోవచ్చు. కానీ 50 శాతం కూడా మనశ్శాంతితో లేరు. మీరు వచ్చి ఆ సంఖ్యను పెంచాలని చూడటం స్వయంకృతమే కాగలదు. మనదేశంలో చదువులు అధ్వాన్నంగా ఉన్నాయి కాబట్టి, వాటిని బాగుచేసేలోగా చదువుకోవడానికి అమెరికా రండి. కానీ తిరిగి స్వదేశానికి వెళ్లి మనదేశాన్ని బాగుచేయటానికే ప్రయత్నించండి. తప్పనిసరి అనుకుంటే తప్ప అమెరికాలో స్థిరపడాలనుకోవద్దు. చదువు కోసం కూడా అమెరికా రాలేనివారు చింతించకుండా, స్వదేశంలో విద్యారంగం నుంచి మొదలుపెట్టి సమూల మార్పుల సాధనలో భాగస్వాములవ్వండి. అదే మీ కర్తవ్యంగా భావించండి. ఈ మార్పుని ఎంత త్వరగా సాధించుకోగలిగితే భారత్‌కు అంత మేలు జరుగుతుంది. గుడ్‌లక్!

## స్వతంత్ర నిపుణుల నివేదిక.. 2019 ఏపీ ఎన్నికల ఎజెండా కావాలి

నాకు నా 9 సంవత్సరాల వయసు నుంచి వార్తాపత్రికలు చదవడం అలవాటుగా మారింది. ఒకే ఇంట్లో మేము, మా పెదనాన్న గారూ చెరో పోర్షన్‌లో ఉండేవాళ్లం. మా నాన్నగారు తెలుగు పేపర్, మా పెదనాన్నగారు హిందూ పేపర్‌ను తెప్పించడం వలన రెండు పేపర్లూ చదవడం అలవాటు చేసుకున్నాను. జ్ఞానం తెలిశాక రాజకీయాలు తెలుసుకోవడం, ఒక అభిప్రాయం ఏర్పడటం, నాన్నగారితోనూ మా కజిన్స్‌తోనూ చర్చించడం జరిగేది. అలా కొంత అవగాహన, ఇష్టం ఏర్పడ్డాయి. ఆనాటి పరిజ్ఞానమే కొనసాగుతూ లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, తర్వాత లోక్‌సత్తా పార్టీకి తోడ్పడేలా చేసింది. ఇది నాకెంతో సంతోషాన్నిస్తుంటుంది. సమాజాన్ని పట్టించుకునే మంచి అలవాటు భవిష్యత్తులో మనకో చక్కని అవకాశానికి కూడా దారితీయవచ్చు. ఇందులో వృథా ఉండదు. ఏ అవకాశమూ రాకపోయినా, మన నాలెడ్జి మనం చేసే పనుల్లో మన ఉన్నతికి దోహదం చేస్తుంది. ఇప్పుడంటే ప్రసారసాధనాలు, కొందరి ప్రచారసాధనాలుగా తయారై కొన్ని వార్తలను వాస్తవాలకు దూరంగా ఇస్తున్నాయిగానీ, అప్పట్లో చాలామేర వార్తలు నిష్పాక్షికంగా ఉండేవి. వ్యాఖ్యానాలు, అభిప్రాయాలు ఎంతో విలువైనవిగా, అనుసరించదగ్గవిగా ఉండేవి. లోక్‌సత్తాని అభిమానించే అనేకమంది జర్నలిస్టులు ఉన్నారు. వారు సమాచారాన్ని మాబోటి వాళ్లకు అందిస్తుంటారు. వారందరికీ ధన్యవాదాలు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల పర్వం మొదలవనుంది. ఏపీలో ఎన్నికల వాతావరణం లోక్‌సత్తాకు అనుకూలంగా ఉందని పలువురు మిత్రులు చెబుతున్నారు. జేపీగారు సరైన నిర్ణయం తీసుకుంటారని మాకు నమ్మకం ఉంది. మా సహకారం ఎప్పుడూ ఉంటుంది. ఒక రాష్ట్రంగా ఏపీకి కేంద్రం ఎన్ని నిధులిచ్చిందో వేరే విషయం. కానీ విభజన సమయంలో ఇచ్చిన హామీలకు సంబంధించి ఏమేరకు నిధులిచ్చిందో స్పష్టంగా చెప్పాలి. 2014-15 రెవెన్యూ (వనరుల) లోటుతో మొదలుపెట్టి దాదాపు రూ.86,000 కోట్లు ఏపీకి ఇంకా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సుందని జేపీ కన్వీనర్‌గా వ్యవహరించిన స్వతంత్ర నిపుణుల బృందం నివేదిక తేల్చింది. పోలవరం సాయం ఇందుకు అదనం. ఈ లెక్క పూర్తిగా న్యాయబద్ధమైనది. ఈ డబ్బును ఏపీ ప్రజలకు ఇప్పించటం 2019 అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీల ఎజెండాగా మార్చాలి. ఈ వేలకోట్ల బకాయిని కేంద్రం నుంచి నిర్ణీత కాలవ్యవధిలో ఎలా వసూలు చేస్తారో ప్రతి పార్టీ రాష్ట్ర ప్రజలకు వివరించాలి. దాన్ని బట్టి ప్రజలు ఓట్లు వేయాలి. ఈ పనిని లోక్‌సత్తావారేకాకుండా, సమాజంలోని ఆలోచనాపరులు, మీడియావారూ చేయాలి. ఎన్నికల్లో గెలిచిన పార్టీ చేత ఆ నిధుల్ని సకాలంలో వసూలు చేయకపోతే, మళ్లీ లోక్‌సత్తా, పౌరసమాజం, ఇతర పార్టీలు, మీడియా కలిసి పోరాటం చేయాలి. ఫెడరలిజాన్ని బలోపేతం చేసేలా ఈ పోరాటాన్ని జాతీయస్థాయికి తీసుకెళ్లి అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే నవభారత నిర్మాణానికి పునాది వేయాలి. ✧

# సర్పంచ్‌ల ప్రాధాన్యత పెంచిన కొత్త పంచాయతీరాజ్ చట్టం




తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు కొత్త పంచాయతీరాజ్ చట్టంలో భాగంగా విధులు, అధికారాలు, బాధ్యతల గురించి శిక్షణనిస్తున్నారు. రాష్ట్ర బడ్జెట్ నుంచి నేరుగా తలసరి నిధుల కేటాయింపు, స్వయంప్రతిపత్తి స్థాయి అధికారాల బదిలీ, ప్రజల భాగస్వామ్యం.. వంటి మౌలికాంశాల జోలికి పోకుండా, సర్పంచ్‌లకు మాత్రం కొంత ప్రాధాన్యత కల్పించిన ఆ చట్టానికి సంబంధించి కొన్ని అంశాలు:

**కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌ల విధులు, బాధ్యతలు..**

- చట్టం లేదా ప్రభుత్వ నిబంధనల ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించుకుని సర్పంచ్ తన విధులు నిర్వర్తిస్తారు.
- పంచాయతీ కార్యదర్శి కార్యకలాపాలపై సర్పంచ్‌కు పరిపాలనాపరమైన అధికారం, గ్రామ పంచాయతీలు, ఇతర కమిటీలలో ఆమోదించిన తీర్మానాల అమలుకు పంచాయతీ కార్యదర్శుల విధులపై సర్పంచ్‌ల పర్యవేక్షణ ఉంటుంది.
- రోజువారీ పనుల నిమిత్తం ప్రభుత్వ ఆమోదం మేరకు డబ్బు ఖర్చు చేసే అధికారం సర్పంచ్‌లకు ఉంటుంది. ఈ మేరకు చేసిన వ్యయాలకు తదుపరి పంచాయతీ సమావేశంలో ఆమోదం పొందాలి. పంచాయతీల ఆమోదం మేరకు చెల్లింపులు, ధరావతు చెల్లింపులు జరుపుతారు. చెల్లింపు విషయంలో గ్రామ పంచాయతీ తీర్మానాలకు లోబడే సర్పంచ్ పనిచేయాలి.
- గ్రామంలో పారిశుద్ధ్యం సక్రమంగా ఉండేలా సర్పంచ్ బాధ్యత వహిస్తారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శి చేసే పనులను పరిశీలించటం, పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను సక్రమంగా హాజరయ్యేలా పర్యవేక్షించటం చేస్తారు.
- ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండేలా చూడాలి. శిథిలాలు తొలగించాలి. పాడుబడిన బావులు, నీటి గుంటలు పూడ్చేయాలి. పిచ్చిచెట్లు నరికివేయాలి.
- పంచాయతీకి విధించిన లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఉద్దేశించిన హరితహారం కార్యక్రమాన్ని సర్పంచ్ పరిశీలించాల్సి ఉంటుంది. ప్రతి ఏటా నాటిన మొక్కల్లో కనీసం 85 శాతం పెరిగి పెద్దవయ్యేలా చూడటం సర్పంచ్ బాధ్యత.
- ప్రతి ఇంటికి మొక్కలు సరఫరా చేయాలి. వీధులు, ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచాలి. మొక్కలను జాగ్రత్తగా కాపాడాలి.

- నెలకు ఒకసారి గ్రామపంచాయతీ సమావేశం నిర్వహించాలి. రెండు నెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహించాలి.
- వందశాతం పన్నులు వసూలు చేయాలి. పంచాయతీ రికార్డులు, వీధి దీపాల నిర్వహణ, జనన మరణ రికార్డుల నిర్వహణ.
- సర్పంచ్‌లు తమ గ్రామాల్లోనే నివాసముండాలి. గ్రామపంచాయతీ కార్యాలయానికి క్రమం తప్పకుండా హాజరుకావాలి. గ్రామపంచాయతీ సమర్థవంతంగా పనిచేసేలా అప్పగించిన విధులను పూర్తిచేయడానికి సర్పంచ్‌ల పర్యవేక్షణ ఉపయోగపడుతుంది.

### నిర్లక్ష్యంగా ఉంటే తొలగించే అవకాశం

నూతనంగా ఎన్నికైన గ్రామ పాలకవర్గాలకు అధికారాలతోపాటు బాధ్యతలు కూడా పెరిగాయి. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై వేటు పడేందుకు కూడా అవకాశాలు మెండుగా ఉన్నాయి. కొత్త చట్టంలో నిర్దేశించిన బాధ్యతలు సరిగా నిర్వహించకపోతే, కేటాయించిన నిధులను సవ్యంగా ఖర్చు చేయకపోతే సర్పంచ్‌ల తొలగింపుతోపాటు పాలకవర్గాన్ని రద్దు చేసే అవకాశముంది. చట్టప్రకారం తాను నిర్వహించాల్సిన విధుల నిర్వహణలో విఫలమైతే వివరణ ఇచ్చేందుకు సర్పంచ్‌కు అవకాశమిస్తారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ అతడిని/ఆమెను పదవి నుంచి తొలగించవచ్చు. పంచాయతీల నిర్వహణకు కలెక్టర్ లేదా పీఆర్ కమిషనర్, ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను పట్టించుకోకపోతే విధుల నుంచి తొలగించే అవకాశముంది. ఒకసారి సర్పంచ్‌గా తొలగిస్తే ఆరేళ్లపాటు సర్పంచ్‌గా పోటీ చేయకుండా అనర్హత వేటు వేయొచ్చు. గ్రామాభివృద్ధికి సంబంధించిన ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళికలను పంచాయతీ పాలకవర్గాలు రూపొందించుకోవాలి. చట్టంలో సర్పంచ్‌లకు పూర్తిస్థాయి కార్యనిర్వహణాధికారాలతోపాటు, సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్‌పవర్‌ను కట్టబెట్టారు. గ్రామాల్లో అక్రమ లేఅవుట్లకు అనుమతినిచ్చిన పక్షంలో మొత్తం పాలకవర్గాన్నే రద్దు చేసే అవకాశం ఉంది. అక్రమ నిర్మాణాల విషయంలోనూ కఠిన చర్యలుంటాయి. మూడు వందల మీటర్ల స్థలంలో, పది మీటర్ల ఎత్తు మించకుండా జీప్లస్‌టూ భవనాల నిర్మాణాలకే పంచాయతీలు అనుమతి ఇవ్వొచ్చు. అక్రమ నిర్మాణాల కూల్చివేతకు అయ్యే వ్యయాన్ని సర్పంచ్, స్థానిక కార్యదర్శి భరించాలి (తాత్కాలికంగా నిలుపుదల చేయటం వంటి కారణాల వల్ల వీటిల్లో కొన్ని నిబంధనలపై కొంత గందరగోళం కొనసాగుతోంది).

### ప్రతి ఊళ్లో నర్సరీ

మొక్కల నిర్వహణలో భాగంగా ప్రతి గ్రామంలో మొక్కల పంపిణీ కోసం నర్సరీ ఏర్పాటుతోపాటు ఊళ్లోని ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా మరుగుదొడ్డి ఉండేలా చూసే బాధ్యత సర్పంచ్‌పై ఉంటుంది. ప్రతీ రెండు నెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహించాలి. వరుసగా మూడుసార్లు గ్రామసభలు నిర్వహించకపోతే సర్పంచ్‌లను తప్పించే వీలుంది. ప్రతి నెలా గ్రామపాలకవర్గం సమావేశమై అభివృద్ధి, ఇతర కార్యకలాపాలు సమీక్షించాలి.

### చెత్త పడేస్తే జరిమానా


గ్రామంలో, ఇళ్ల పరిసరాల్లో ఇష్టం వచ్చినట్లు చెత్తాచెదారం పడేస్తే, ఇంటి ఎదుట చెత్త వేస్తే ఆ ఇంటి యజమానికి రూ.500 జరిమానా విధించే అధికారాన్ని సర్పంచ్‌లకు కల్పించారు. ఇంటి నుంచి మురుగునీటిని రోడ్డు మీదకు వదిలితే రూ.5,000 జరిమానా విధించే అవకాశముంది. ఊళ్లోని ప్రతి కుటుంబం ఆరు మొక్కలు నాటాలని చట్టంలో పేర్కొన్నా, వాటిలో కనీసం మూడింటినైనా నాటాలి. హరితహారంలో ఇచ్చిన మొక్కలను పెంచకపోతే ఇంటి యజమాని నుంచి రెండింతలు ఆస్తి పన్నును జరిమానాగా వసూలు చేసే వీలుంది. ✧




*"రేపటి రోజున మనమేమిటన్నది మనం నమ్మే మతాన్ని బట్టో, పట్టే జెండాని బట్టో, ఇచ్చే నినాదాన్ని బట్టో ప్రజలు నిర్ధారణకు రారు. మన పని, మన కష్టం, మన త్యాగం, మన నీతి, స్వచ్ఛమైన మన స్వభావం.... వీటితో తూకం వేస్తారు.*

**- మహాత్మాగాంధీ**

# రాష్ట్ర బడ్జెట్‌లోనే పంచాయతీలకు నిధుల్ని చూపాలి



పంచాయతీల వారీగా రాష్ట్ర బడ్జెట్‌లోనే నిధులను పొందుపరచాలని, ఇలాంటి విధానం కేరళలో సత్ఫలితాలనిస్తోందని హైదరాబాద్‌లోని ఆర్థిక, సామాజిక అధ్యయనాల సంస్థ (సెస్) ప్రొఫెసర్ ఎం.గోపీనాథ్ రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీరాజ్ అంశాలపై సెస్ తరపున పలు నివేదికలను రూపొందించి వివిధ రాష్ట్రాలకు ఆయన అందించారు. తెలంగాణలో నూతన పాలకవర్గాలు కొలువుతీరి, నూతన పంచాయతీరాజ్ చట్టం కింద విధులను ప్రారంభించిన నేపథ్యంలో.. 'ఈనాడు'తో మాట్లాడారు. తెలంగాణలోని తన అధ్యయనాంశాలను వివరించారు.

**పంచాయతీలకు కేరళ బడ్జెట్‌లోనే నిధులను ప్రత్యేకంగా పొందుపరుస్తుంటారు. తెలంగాణ ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో భారీగా నిధులు ఇస్తామంటోంది. కేటాయింపుల తర్వాత ఆయా మొత్తాలు పంచాయతీలకు వెళ్లేలా కేరళలో ఎలాంటి విధానాలను అనుసరిస్తుంటారు?**

పంచాయతీరాజ్ అనగానే అందరూ ప్రస్తావించే కేరళ రాష్ట్రాన్నే తీసుకుంటే.. అక్కడ బడ్జెట్‌లో 'జీపీ విండో' అనే పేరుతో మొత్తం ప్రణాళిక బడ్జెట్‌లోని 30 నుంచి 40 శాతం వరకు పంచాయతీలకు కేటాయించే విధానం ఉంది. తమ పంచాయతీకి ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ఎంత మొత్తం అందుతుందనేది అక్కడ అందరూ తెలుసుకోగలుగుతున్నారు. ఇలాంటి పద్ధతి తెలంగాణలో రావాలి. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం నిధులన్నీ ఇప్పుడు నేరుగా పంచాయతీలకు వెళ్తున్నాయి. దీంతో మండల, జిల్లా పరిషత్‌లు ఆర్థిక సమస్యలతో



కొట్టుమిట్టాడుతున్నాయి. వీటి గురించి కూడా ఆలోచించాలి. రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటులో ఇప్పటికే జాప్యం నెలకొంది. తద్వారా కొన్ని కేంద్ర నిధులను రాష్ట్రం కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పుడు తండాలు సైతం పంచాయతీలైనందున పన్నుల ఆదాయం ఒక్కటే సరిపోదు. రాష్ట్రంలో 2016–17లో పంచాయతీల సొంత పన్నుల డిమాండ్ రూ.462 కోట్లు

కాగా అందులో రూ. 411 కోట్లు వసూలయ్యాయి.

**తెలంగాణ ప్రభుత్వం కొత్త అంశాలతో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని 2018, ఏప్రిల్‌లో అమల్లోకి తెచ్చింది. తద్వారా గ్రామాల్లో మెరుగైన ఫలితాలు ఉంటాయని భావిస్తున్నారా?**

రాజ్యాంగ సవరణ ప్రకారం ఇవ్వాల్సిన అధికారాల గురించి చట్టంలో ఏమీ చెప్పలేదు. పంచాయతీలు సాధారణంగా నిర్వహించే పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి వాటి గురించే చట్టంలో పునరుద్ఘాటించారు. సక్రమంగా పనిచేయని సర్పంచులను సస్పెండ్ చేస్తామని, తొలగిస్తామనే హెచ్చరికల వల్ల కొన్ని ఫలితాలు ఉండనున్నప్పటికీ అన్నింటికీ ప్రజల ద్వారా ఎన్నికై వచ్చేవారినే బాధ్యులను చేయటం తగదు. వారికి తగిన అధికారాలను, విధులను అప్పగించాలి. వారిపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు అంబుడ్స్‌మన్ వ్యవస్థ ఏర్పాటు అవసరం. కేరళలో ఈ వ్యవస్థ ఉంది. అక్కడ 'కుటుంబ శ్రీ' అనే కార్యక్రమం ద్వారా స్వయం సహాయక బృందాలవారిని పంచాయతీలకు అనుసంధానం చేస్తున్నారు. కొన్ని అంశాల్లో బీహార్, రాజస్తాన్ వంటి రాష్ట్రాలూ మెరుగైన విధానాలను అవలంబిస్తున్నాయి. కర్ణాటక పద్ధతులూ కొన్ని బాగున్నాయి.

**గ్రామస్థాయి ప్రణాళికల తయారీ ఏ విధంగా ఉంటోంది?**

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)లను తయారు చేయడం ఇప్పుడు తప్పనిసరి. తెలంగాణలో దీన్ని గ్రామజ్యోతి పేరుతో వ్యవహరిస్తున్నారు. నిధుల లభ్యతను పేర్కొనకుండా ఇక్కడ జీపీడీపీలను తయారు చేస్తున్నారు. వీటి వల్ల ఫలితం ఉండదు. గ్రామ ప్రణాళికలో పంచాయతీ మొత్తం స్థితిగతులు ప్రతిఫలించాలి. ప్రతి జిల్లాలో జిల్లా ప్రణాళికా సంఘాలు (డీపీసీలు) తప్పకుండా ఏర్పాటై అవి తయారుచేసే జిల్లా ప్రణాళికల్లో గ్రామ ప్రణాళికలు ప్రతిఫలించాల్సి ఉండగా.. అలాంటి ఏర్పాట్లే ప్రస్తుతం మృగ్యమయ్యాయి. వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు నిధి (బీఆర్‌జీఎఫ్) పథకం నిధుల కోసం జిల్లా ప్రణాళికా సంఘాలను లోగడ ఏర్పాటు చేసినప్పటికీ.. ఆ పథకం రద్దు కాగానే సంఘాలు ఉనికిలో లేవు. గ్రామసభలనూ సక్రమంగా నిర్వహించడం లేదు.

**ప్రభుత్వం ఇచ్చే శిక్షణ పంచాయతీ పాలకవర్గాలకు ఏ మేరకు ఉపయోగపడుతోంది?**

నిధులు, అధికారాలు లేకుండా ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వటం వల్ల ప్రయోజనం ఉండదు. మేం వివిధ గ్రామాల్లో ఇంతకు ముందు సర్వే నిర్వహించినప్పుడు రాజ్యాంగపరంగా లభించాల్సిన అధికారాలపై సర్పంచులకు అవగాహన లేదని వెల్లడైంది. రాజ్యాంగ సవరణలో చెప్పిన అంశాలను అమలు చేసి అప్పుడు ఆయా శ్రేణులకు శిక్షణనిస్తే ప్రయోజనం ఉంటుంది.

***రాజ్యాంగ సవరణకు ముందు.. గ్రామాల్లోని ఉపాధ్యాయులపై సర్పంచులకు అధికారం ఉండేది. రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విద్యపై పంచాయతీలకు అధికారం లభించినప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వం దాన్ని పూర్తిస్థాయిలో బదిలీ చేయకపోవడం వల్ల పాఠశాలలపై పూర్తి అజమాయిషీ లేకుండా పోయింది. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పంచాయతీల పర్యవేక్షణలో ఉంటే మెరుగైన ఫలితాలు అందించగలుగుతాయి.***

**రాజ్యాంగ సవరణకు అనుగుణంగా కొన్ని అధికారాలను ఇచ్చామని ప్రభుత్వం చెబుతుంటే.. ఈ విషయమే తమకు తెలియదని సర్పంచులు అంటున్నారు. ఇలాంటి వైరుధ్యం ఎందుకు ఉత్పన్నమవుతోంది?**

73వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీలకు విద్య, వ్యవసాయం, పశుసంవర్థకం వంటి 29 అధికారాలను అప్పగించాలి. వీటిలో కొన్నింటిని ఇస్తున్నట్లు ప్రభుత్వం జీవోలను ఇచ్చినా.. వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ అనే అంచెల వ్యవస్థలో ఏ సంస్థకు ఏయే అధికారాలను దఖలు పరుస్తున్నదీ వివరించే పటం (యాక్టివిటీ మ్యాప్) తయారీ అవసరం. గతంలో ఆరేడు అధికారాలకు ఇలాంటి మ్యాప్‌లను తయారుచేసినా తర్వాత వాటిని అధికారులు పట్టించుకోలేదు. రాజ్యాంగ సవరణకు ముందు.. గ్రామాల్లోని ఉపాధ్యాయులపై సర్పంచులకు అధికారం ఉండేది. రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విద్యపై పంచాయతీలకు అధికారం లభించినప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వం దాన్ని పూర్తిస్థాయిలో బదిలీ చేయకపోవడం వల్ల పాఠశాలలపై పూర్తి అజమాయిషీ లేకుండా పోయింది. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పంచాయతీల పర్యవేక్షణలో ఉంటే మెరుగైన ఫలితాలు అందించగలుగుతాయి. ✧

# ఉద్యోగస్వామ్య పాలన నుంచి 'ప్రజల భాగస్వామ్య' పాలనలోకి...



- ఎం. ధర్మారావు,
రాష్ట్ర రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ (ఇరిగేషన్),
mdhramarao.water@gmail.com

ఇటీవల హైదరాబాద్ మహా నగరంలో ఒక రిటైర్డ్ ప్రభుత్వాధికారికి ఎదురయిన పరిస్థితి ఇది. ఆయనేమీ చిరుద్యోగి కూడా కాదు. ఏకంగా రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రితో సమా వేశాల్లో పాల్గొనే స్థాయి అధికారి. కానీ మన ప్రభుత్వాధికారుల వ్యవస్థ పనితీరు ఎంత ప్రజావ్యతిరేకంగా ఉందో ఆయనకు రిటైరయ్యాక బాగా అర్థమైంది. ఇంతకీ విషయమేంటంటే, ఆయన ఉద్యోగంలో ఉండగానే ఎన్నో ఏళ్ల క్రితం నగరంలోని ఓ ప్రాంతంలో ఇల్లు కట్టుకున్నారు. తన ఇంటి డ్రైనేజీని మూసీ నదికి సంధానం చేశారు. ఆ ఇంటికి దగ్గర్లోనే మూసీ పారుతోంది. అప్పట్లో వారి ఇల్లు మూసీ నది ఉన్న చోటు కంటే ఎక్కువ ఎత్తులో ఉండేది. ఇటీవల మూసీలో డ్రైనేజీ పారకుండా పొంగి పొర్లుతూ సదరు విశ్రాంత ఉద్యోగి ఇంటి నుంచి వచ్చే మురుగును కూడా వెనక్కు తన్నటం మొదలు పెట్టింది. దీంతో, మూసీ ద్వారా బయటకు పారాల్సిన కాలుష్యం తిరిగి వారి ఇంటిలోకే వచ్చేస్తోంది.

పన్నుల డబ్బుల్ని ఠంచనుగా రూపాయి తగ్గకుండే కట్టే పౌరునిగా ఆయన తన సమస్య మీద మునిసిపల్ కార్పొరేషన్ వారికి ఫిర్యాదు చేశారు. అంతా ఆన్‌లైన్ అని హడావుడి చేశారు. ఇదేదో బాగుందని ఆయన కూడా చాలా ముచ్చట పడ్డారు. కొన్ని రోజులకి ఒక వాహనం వచ్చి వారింటి నుంచి మురుగు వెళ్లి మూసీలో కలిసే చోట పూడికతీత గావించింది. దీంతో మళ్లీ మురుగు ముందుకు పోవటం మొదలైంది. 'మీ సమస్య పరిష్కారమైపోయింది' అని ఆన్‌లైన్‌లో నమోదై మెస్సేజీ వచ్చింది. ఫటాఫట్.. అంతా బ్రహ్మాండంగా జరిగిపోయింది అనుకున్నారాయన. కానీ కొద్దిరోజుల్లోనే మళ్లీ సమస్య మొదటికొచ్చింది.

మళ్లీ ఫిర్యాదు, మళ్లీ యంత్రంబండి వచ్చి పూడికతీత, మళ్లీ తాత్కాలికంగా ఉపశమనం.. ఇలా కొన్నిసార్లు గడిచాక ఆయన సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేయటం మొదలుపెట్టారు. సమస్య తమ ఇంటి వద్ద లేదు.. ఇంటి దాకా రావటానికి ముందే, మూసీ పరివాహక ప్రాంతంలో ఉందని ఆయన యంత్రవిద్య అనుభవం తేటతెల్లం చేసింది. దీనివల్లే తన ఇల్లు మెరక మీద ఉన్నా కూడా మురుగు బైటికి పోకుండా వెనక్కు తంతోందని అర్థమైంది. ఇదే విషయాన్ని మునిసిపల్ అధికారులకు వివరించి, 'అయ్యా! యంత్రంతో పూడికతీత కాకుండా మూసీ పరివాహక ప్రాంతంలో ఈ చర్యల్ని చేపట్టండి' అని నిర్దిష్టంగా ఆ పరిష్కారాల్ని సూచించారు. అదేదో కోట్ల రూపాయల బడ్జెట్ కూడా కాదు. చాలా తక్కువ మొత్తంతోనే పూర్తయ్యే విధంగా, తనతోపాటు ఇంకా అనేక మందికి కూడా ఉపయోగం కలిగించేలా చెప్పారు. అయినా అధికారులు వినిపించుకోలేదు.


'మీరు ఫిర్యాదు చేస్తే, వచ్చి పూడిక తీస్తారు, మీ సమస్య పరిష్కారమైనట్లు ఆన్‌లైన్‌లో వచ్చేస్తుంది.. అంతవరకే మా డ్యూటీ' అని తేల్చిచెప్పారు. అసలు ఆ పూడికతీత యంత్రాలు రావటానికే ఎన్నో ఏళ్లు కథ నడిచిందని, కొందరు అణగారిన కులాల ఎంటర్‌ప్రెన్యూర్‌లు గట్టిగా ప్రయత్నించబట్టి సాధ్యమైందని, అయితే వాటిని కూడా దుర్వినియోగం చేసి బిల్లులకద్వారా కమీషన్‌తో జీహెచ్‌ఎంసీలో అధికారగణం లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందితప్ప.. ప్రజల సమస్యలకు మూలాల్ని తెలుసుకుని కొత్త ఆలోచనలతో, తక్కువ ఖర్చుతో, ఎక్కువ మందికి మేలు చేసే ప్రయత్నం కించిత్తు కూడా జరగటం

లేదని సదరు విశ్రాంత అధికారికి తెలిసొచ్చింది. మన ఉద్యోగుల దెబ్బకి సాంకేతిక పరిజ్ఞానం కూడా బలాదూర్ అని తేలిపోయింది.

పంటి కింద రాయిలా, చెప్పులో ముల్లులా, చెవిలో జోరీగలా తన ఇంటి పారిశుద్ధ్య సమస్య వేధిస్తుండటంతోపాటు, తన పింఛను డబ్బుతో ప్రజలకు ఏదైనా చేద్దామని ఆయన ప్రారంభించిన ప్రయత్నాలకు కూడా బ్యూరోక్రసీ అడ్డంపడుతుండటంతో విసిగిపోయారు. ప్రభుత్వంలో ఉన్నతోద్యోగం చేసిన తనకే పరిస్థితి ఇలా ఉంటే, సామాన్యులను ఉద్యోగులు ఎలా ఆడుకుంటారోనని వేదన చెందారు. పనిచేసినా చేయకున్నా జీవితాంతం ఎవరూ పీకలేనిరీతిలో ఉద్యోగంలో కొనసాగించటం తప్ప.. ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలతో సమస్యల్ని పరిష్కరిస్తూ ప్రజాసేవకుల్లా ఉద్యోగులు పనిచేసే ప్రభుత్వోద్యోగ వ్యవస్థను నిర్మించకపోవటం మన దేశానికి ఎంత నష్టం వాటిల్లిందో, వాటిల్లుతోందో ఆయనకు చక్కగా అర్థమైంది.

.. ఇలాంటి ఘటనలను, అనుభవాలను అనేకం చూడటం వల్లే.. ఉద్యోగస్వామ్య పాలనను ప్రజల భాగస్వామ్యమున్న పాలనగా మార్చాలని మేం సంకల్పించాం. అదే అంతిమంగా మన ప్రజాస్వామ్యంలో, ప్రజల జీవితాల్లో సంక్షోభానికి విరుగుడు అని గుర్తించాం.

ప్రజలకేం తెలుసు అనే భావన అధికారుల్లో చాలామందిలో పాతుకు పోయి ఉంది. వాస్తవమే, ప్రజలకు ప్రతి విషయం తెలియదు. కానీ వారి జీవితాలు, వారుండే ప్రాంతాలు, వారి డబ్బు వినియోగం వాటి గురించి మాత్రం



మనందరికంటే వారికే బాగా తెలుసునటంలో సందేహం లేదు. అయితే వారు తమకు అవసరమైన, తమకు పట్టున్న స్థానిక అంశాల గురించి కాకుండా.. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, రాష్ట్ర, కేంద్ర రాజకీయాల గురించి ఆలోచిస్తూ తమ భావోద్వేగాల్ని, సమయాల్ని వృథా చేసుకుంటుండటం వల్ల సమస్య జటిలమవుతూ పెరుగుతోంది. స్థానిక పరిష్కారాలు, సాధికారత మీద ప్రజల్లోనే పెద్ద ఉత్సుకత లేకపోవటం వల్ల అధికారులు ఆటాడుకుంటున్నారు. దీన్నడ్డంపెట్టుకుని, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించిపెట్టే పేరుతో స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు కమిటీలు వంటి వాటిని నిర్వీర్యం చేస్తున్నారు. ఒకవక్క ప్రభుత్వ కార్యాలయాల్ని సరిగే పనిచేయించే ఏర్పాట్లు చేయటంతోపాటు, ఇంకోపక్క స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసి ఎక్కడికక్కడ ప్రజల భాగస్వామ్యంతో పనిచేయించగలిగితే మన దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

ఈ అవగాహనతోనే, ప్రజల భాగస్వామ్యంతో కరీంనగర్‌ను 'స్మార్ట్ సిటీ'గా నిర్మించాలనే ఆలోచన మొదలైంది. దీనికి సంబంధించిన వివరాల్ని ప్రజల ముందుంచటంతోపాటు, ప్రజల సమస్యలను వారి సూచనల మేరకు పరిష్కరించటంలో వివిధ రంగాల పౌర నిపుణులు, ప్రజాప్రతినిధులు, అధికారులను భాగస్వాముల్ని చేయటమే మా మిషన్ లక్ష్యం.

### కరీంనగర్ స్మార్ట్ సిటీ - ప్రజల మేనిఫెస్టో

**1. పౌరుల చొరవతోనే మొదలు:**

ఈ ప్రాజెక్టు పౌరుల చొరవతోనే మొదలవుతుంది, పౌరుల సంప్రదింపులతోనే లక్ష్యాల సాధన ఉంటుంది. సంప్రదింపుల్లో భాగంగా పౌరులు, పౌర బృందాలు లేవనెత్తే అంశాల్ని, సమస్యల్ని, వారు అనుకునే ప్రాథమ్యాల్ని గుర్తిస్తారు. పౌరుల ద్వారానే పరిష్కారాలు వచ్చేట్టు చూస్తారు. పాలనలో పౌరుల భాగస్వామ్యం మొక్కుబడి కాదు. అభివృద్ధి సుస్థిరమవ్వాలంటే, ఉమ్మడి కార్యక్రమాల అమలులో పౌరుల భాగస్వామ్యం, పర్యవేక్షణ ఉండాలి.

**2. లక్ష్యం:**

నగరంలోని పౌరులకు నాణ్యమైన జీవితాన్ని, స్వచ్ఛమైన, సుస్థిర పర్యావరణాన్ని అందించేందుకు కావలసిన మౌలిక వసతుల్ని పెంపొందించటం.. ప్రగతి, అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగే నూతన ఒరవడికి నాంది పలకటం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.





**3. పాలన, అభివృద్ధి ప్రణాళిక:**

స్మార్ట్ సిటీకి ఇచ్చిన నిర్వచనాన్ని బట్టి చూస్తే.. ప్రస్తుతమున్న అధికార యంత్రాంగ ఆధిపత్యం, పెత్తందారీ పోకడలకు భిన్నంగా పాలనను, అభివృద్ధిని పౌరుని చుట్టూ కేంద్రీకృతం చేయాలనే ఆలోచన ప్రభుత్వంలో కనిపిస్తోంది. ప్రజాస్వామిక ప్రభుత్వ మంటే.. 'ప్రజల యొక్క ప్రజల కొరకు, ప్రజల చేత' అనే సూత్రాన్ని ఇది బలోపేతం చేస్తుంది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కుల అధికరణలు కూడా ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యత కల్పించాయి. రాజ్యాంగం ఇచ్చిన ఈ అవకాశం.. చట్టం కంటే ఎక్కువ. అభివృద్ధికి సంబంధించి నిర్ణయం తీసుకోవటం దగ్గర్నుంచి వివిధ దశలలో ప్రజలనే కేంద్రబిందువుగా చేయాలన్నది స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో మనం గుర్తించాల్సిన, ప్రాధాన్యత నివ్వాల్సిన అంశం.

ఇలా స్థానికంగా ఉండే ప్రజల భాగస్వామ్యంతో పాలన చేయటం వల్ల.. స్మార్ట్ సిటీకి కావలసిన మౌలిక వసతులను పునరావిష్కరించటం, పునర్నిర్మాణం చేయటం వంటి సానుకూల పరిణామాలు చోటుచేసుకుంటాయి.

పునరావిష్కరణ వల్ల.. ప్రజల ఉమ్మడి అవసరాలకు ఉపయోగపడే అన్ని వ్యవస్థలూ మౌలికంగా కొత్త రూపును సంతరించుకుంటాయి. వాటి పనితీరు, సామర్థ్యం మెరుగుపడతాయి. పరిస్థితుల కనుగుణంగా మారుతూ నూతన ధోరణులను ఇముడ్చుకుంటూ నిరంతరం మనగలుగుతాయి. ఈరకంగా అబ్బుర పడేలా వ్యవస్థలు అనేకరెట్లు ప్రభావశీలంగా రూపుదిద్దుకుంటాయి.

ప్రజల భాగస్వామ్యానికి ఇంత పరివర్తనా శక్తి ఉంది కాబట్టే.. అవగాహన, ఆర్తి గల అనేకమంది ఇంజినీర్లు, డాక్టర్లు, విద్యావేత్తలు, సామాజిక, పర్యావరణవేత్తలు, సంఘ సేవాసంస్థలు, తదితరులు ఆయా రంగాల్లో తమకున్న అపార పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని, అనుభవాన్ని స్వచ్ఛందంగా ప్రజలకు సేవగా అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరు సమస్యల్ని గుర్తించి, ప్రజల సూచనలను అర్థం చేసుకుని, కొందరికి కాకుండా పౌరులందరికీ అభివృద్ధి అవకాశాలుండేలా స్మార్ట్ పరిష్కారాల్ని అందిస్తారు.

**4. ప్రాధాన్యతలు:**

స్మార్ట్ సిటీల మిషన్ ద్వారా ఆశిస్తున్న సమగ్రాభివృద్ధిలో పేద, అణగారిన, అవకాశాలు కొరవడిన, వయసు పైబడిన ప్రజానీకానికి మెరుగైన జీవనాన్ని అందించటం కీలకం. అందుకే వారి జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలకు మొదటి ప్రాధాన్యతనివ్వాలి.

సమగ్రాభివృద్ధికి కొన్ని అంశాలు..

- తక్కువ సమయం, ఖర్చు, సహజ వనరులతో ఎక్కువ ఫలితాల్ని సాధించటానికి వీలుగా స్మార్ట్ పరిష్కారాల్ని అమలు చేయాలి.
- రద్దీని, గాలి, నీటి కాలుష్యాల్ని తగ్గించి.. హాయిగా నడిచి వెళ్లిరాగలిగేలా అభివృద్ధి చేయటం. వాహనాలు, ప్రజారవాణాకే కాకుండా పాదచారులకు, వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలు, సైకిల్ వాహనదారులకు ప్రత్యేక మార్గాలుండేలా రోడ్డు మార్గాల్ని నిర్మించటం, పునరుద్ధరించటం. నడిచో, సైకిలేసుకునో వెళ్లి సౌకర్యవంతంగా పనులు చేసుకోగలిగేలా అవసరమైన ప్రభుత్వ సేవలను అందించాలి.
- పార్కులు, ఆటస్థలాలు, వినోద కేంద్రాలు వంటి బహిరంగ ఖాళీ ప్రదేశాలను పరిరక్షణ, అభివృద్ధి చేయాలి.
- నీటి సంరక్షణ, మురుగునీటి నిర్వహణ, ఘన వ్యర్థాల మేనేజ్‌మెంట్, పునర్వినియోగం (రీసైక్లింగ్).
- రకరకాల ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాల్ని పెంపొందించాలి. పని, నివాసం, షాపింగ్, వినోదం వంటివన్నీ నడక దూరంలో అందుబాటులో ఉండేలా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ చుట్టూ ట్రాన్సిట్ డెవలప్‌మెంట్ (టీఓడీ), ప్రజా రవాణా, మారుమూల వీధుల్లోకి పారా ట్రాన్స్‌పోర్ట్ కనెక్టివిటీ.
- ప్రజల పన్నుల డబ్బును సద్వినియోగం చేసే పౌరులకు స్నేహపూర్వకమైన పాలనను అందించాలి.

**5. నగరాభివృద్ధి ఇప్పుడెలా ఉంది?:**

ఇటీవల ఒక టీవీ ఛానల్‌లో ప్రైమ్ టైమ్‌లో నిర్వహిస్తున్న ఒక టాక్‌షోలో ప్రజంటర్ ఓ ప్రశ్న అడిగారు.

"ప్రభుత్వ ఆదాయం పెరుగుతున్నా, ప్రజలకు తాయిలాల్ని ఇస్తున్నా.. పాలనా సంక్షోభం మాత్రం పెరుగుతోంది తప్ప తగ్గటం లేదు. ప్రజలకు – ప్రభుత్వానికి/ రాజకీయ పార్టీలకు మధ్య అగాధం పెరిగిపోతోంది. ప్రజలు స్వతహాగా నిజాయతీపరులే అయినప్పటికీ.. సరిగా

పాలించలేని, దోచుకునే పాలకుల నుంచి ఎంతోకొంత దండుకోవటంలో తప్పులేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ దుష్పరిపాలనను సరిచేయాలంటే ఏం చేయాలి, ఓటు వేసే సమయంలోనే కాకుండా, ఎన్నికల మధ్య ఐదేళ్లలో కూడా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు పాలనలో ఎటువంటి మార్పులు రావాలి?" అనడిగారు. దానికి చర్చకు వచ్చిన అతిథి అయోమయంగా చూస్తూ, ప్రజలకు భాగస్వామ్యమేంటి? అదెలా సాధ్యం? అని ఎదురు ప్రశ్నించారు. చివరికి ఆయన సమాధానమంతా ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, అధికారుల చుట్టూ తిరిగిందే తప్ప ప్రజల ప్రస్తావన లేదు. తప్పదు కాబట్టి ప్రజలను ఎన్నికల సమయంలోనైనా గౌరవిస్తున్నామన్నట్లు ఆయన జవాబిచ్చారు. మన పాలనా, రాజకీయ సంక్షోభానికి మూలం ఇక్కడే ఉందని సమాజం గురించి పట్టించుకునే మాలాంటి వారి భావన.

ప్రస్తుత పాలన ప్రజలను ఓటింగ్, షౌటింగ్‌కు పరిమితం చేస్తోంది తప్ప వారి ఆలోచనల్ని, భాగస్వామ్యాన్ని అనుమతించటం లేదు. ఎప్పుడైనా సంప్రదింపులు ఉంటే, అవి కేవలం ప్రభుత్వాలు తమకు నచ్చిన, తాము ఎంపిక చేసుకున్న కొద్దిమంది వ్యక్తులతోనే చేస్తున్నాయి. అవి కూడా తూతూ మంత్రంగా ఉంటున్నాయి. దీనివల్ల, ప్రజల అసలైన సమస్యలు, వారి అవసరాలు, ప్రాథమ్యాలు వెలుగులోకి రావటం లేదు. సమస్యలు పేరుకు పోతున్నాయి తప్ప.. అర్థవంతమైన, సుస్థిరమైన అభివృద్ధికి దోహదం చేసే స్మార్ట్ పరిష్కారాలు అమలవటం లేదు. సమస్యలపై సంబంధిత ప్రజానీకాన్ని సంప్రదించి, వారి సూచనలను పరిగణలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకుని అమలు చేసేలా పాలన ఉండి ఉంటే.. ఫలితాలు భిన్నంగా ఉండి అభివృద్ధి కొత్త పుంతలు తొక్కేది.

పాలనలోని ఉదాసీనత, బ్యూరోక్రాటిక్ ధోరణుల వల్ల భవనాలు, రోడ్లు, వంతెనలు, మురుగునీరు, పారిశుద్ధ్యం, తాగునీటి వ్యవస్థలు వంటి మౌలిక వసతుల్ని పాత సంప్రదాయ పద్ధతులు, నమూనాల్లోనే నిర్మిస్తున్నారు. ప్రస్తుత మౌలిక వసతుల నిర్మాణ రూపకల్పన, నాణ్యత ఇండియన్ స్టాండర్డ్ కోడ్స్‌కు ఏమాత్రం అనుగుణంగా లేదు. ఆ పనులు నాసిరకంగా, అనవసర్థంగా ఉంటున్నాయి. ఫలితంగా, పన్నుల డబ్బు వృథా అవుతోంది, దోపిడీ అవుతోంది తప్ప.. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు మాత్రం నెరవేరటం లేదు.

**6. పాలనా వ్యవస్థల వైఫల్యం వల్ల మన కళ్ల ముందు కనిపించే వైఫల్యాలు:**

**ఎ. రహదారులు:**

సరైన పద్ధతి లేకుండా నిర్ణయాలు తీసుకుని నిర్మించటం వల్ల చాలా చోట్ల రోడ్లకు వంపు, వాలు సరిగా ఉండవు.

ఉపరితల డ్రెయిన్లను సరైన రూపకల్పనతో నిర్మించకపోవటం వల్ల వానాకాలంలో రోడ్లు, నివాస ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. రోడ్ల మీద గుంతలు ఏర్పడుతున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ జామ్‌లు, యాక్సిడెంట్లు చోటుచేసుకుంటున్నాయి. ప్రజలు తమ అవసరాల నిమిత్తం స్వేచ్ఛగా వెళ్లగలిగే పరిస్థితుల్ని ఈరకంగా దుష్పరిపాలనతో పాలనా యంత్రాంగమే దెబ్బతీస్తోంది. ముఖ్యంగా పాదచారులు, సైక్లిస్టుల ప్రాణాలకు ముప్పును కలిగిస్తోంది.

**బి. స్వేచ్ఛగా తిరగగలిగేందుకు తోవలు, కాలిబాటలు:**

వివిధ రకాల వాహనాలు ప్రయాణించటానికి, పాదచారులు నడవటానికి ఉద్దేశించిన రోడ్లు, వీధుల నిర్మాణం భారతీయ ప్రమాణాల కోడ్‌లకు ఏమాత్రం అనుగుణంగా లేవు. జనానికి ఏం తెలుసు, ఏమడుగుతారులే?! .. అనే నిర్లక్ష్యమే ఈ నిర్మాణాల్లో కనిపిస్తుంది. 500 మీటర్ల పొడవున్న తోవలు, ఫుట్‌పాత్‌లను కూడా అవరోధాలు, లోపాలు లేకుండా నిర్మించటం లేదు. అలాంటప్పుడు, పేదలు, దివ్యాంగులు రోజువారీ అవసరాల కోసం సౌకర్యవంతంగా అటూఇటూ వెళ్లగలిగే ఏరియాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకోవటం ఎంత హాస్యాస్పదం!

విధానపత్రంలో చెప్పారుగానీ.. ఆహ్లాదకరంగా నడిచి వెళ్లగలిగే ప్రదేశాలను అభివృద్ధి చేయటంలో భాగంగా ఫుట్‌పాత్‌లను ప్రమాణాలతో, డిజైన్‌తో నిర్మించటం లేదు. సరైన, ప్రామాణికమైన ఫుట్‌పాత్‌లు, సైక్లిస్టులకు ప్రత్యేకమైన తోవలు లేకపోవటం వల్ల పెద్ద రోడ్ల మీద కూడా రద్దీ విపరీతమై, ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చివరికి పేదవాడు, సామాన్యుడే బాధితుడు.

పాదచారులు, సైకిలు మీద వెళ్లేవారు, మోటారు వాహనం మీద వెళ్లేవారు.. అందరికీ రోడ్డు హక్కు సమానమే. రోడ్డును సమానంగా వినియోగించుకునే అధికారం వారికుంది. ఈ హక్కును పరిగణలోకి తీసుకునే రోడ్లు, ఫుట్‌పాత్‌లు, తోవలు, సైక్లిస్టులకు ప్రత్యేక మార్గాలను

నిర్దిష్ట ప్రణాళికతో రూపొందించాలని గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిబంధనలు, సుప్రీంకోర్టు చట్టం స్పష్టంగా నిర్దేశిస్తున్నాయి.

సి. వంతెనలు, కల్వర్టులు, డ్రైనేజీ:

పట్టణీకరణ వేగంగా పెరిగిపోతుండటంతో, కాలనీలు, నివాస ప్రాంతాలు పెరిగిపోతున్నాయి. గ్రామ, పట్టణ ప్రాంతాల ప్రణాళిక నిబంధనలను అనుసరించకుండానే వీటిల్లోని లే అవుట్లను ఆమోదిస్తున్నారు. ఇక్కడ నిర్మిస్తున్న డ్రైనేజీ వ్యవస్థలు.. అవి భూగర్భ కావచ్చు లేదా ఉపరితల కావచ్చు.. ప్రామాణిక కోడ్‌లను ఆధారం చేసుకుని నిర్మిస్తున్నవి కావు. స్థానిక పరిస్థితులు, భౌగోళిక పరిస్థితులను అంచనా వేసి వీటి నిర్మాణం చేయటం లేదు. డ్రైనేజీ పనులు అసమగ్రంగా, నాసిరకంగా ఉండటంతో.. నివాస ప్రాంతాలు వరద ముంపునకు గురవుతూ పరిసరాల్ని, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయి.

**డి. పారిశుద్ధ్యం, ఆరోగ్యం:**

రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థల్ని సరైన ప్రమాణాలు, డిజైన్లు లేకుండా నాసిరకంగా నిర్మించటం వల్ల, రోడ్ల మీద, డ్రైనేజీలో నీరు నిలిచిపోయి నీరు కలుషితమవుతోంది. దీనివల్ల దోమలు, చికెన్ గున్యా, డెంగ్యూ వంటి తీవ్ర రోగాలు, ఇతర అనేక ఆరోగ్య సమస్యలు ప్రబలుతున్నాయి.

**7. పరిష్కారం:**

ఈ నేపథ్యంలో, మంచి ఆరోగ్యాన్ని అందించటానికి అసమగ్రమైన, నాసిరకమైన డ్రైనేజీ, వ్యర్థజలాల నిర్వహణ వ్యవస్థల్ని, మౌలిక వసతుల్ని నిర్మించటానికి ఫుల్‌స్టాప్ పెట్టాలి. ప్రమాణాలు లేని ఆ నిర్మాణాల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పైపై మెరుగుల నిర్మాణాలకంటే.. దుష్పరిణామాలు లేకుండా పనికొచ్చే నాణ్యమైన మౌలిక వసతుల్ని మనం మన నగరాల్లో ఏర్పాటు చేసుకోవాలి, ఎటువంటి యాక్సిడెంట్ భయాలూ లేకుండా స్వేచ్ఛగా తిరగగలిగే ప్రదేశాలను అన్నిచోట్లా అభివృద్ధి చేసుకోవాలి, రద్దీని, వాయు, నీటి కాలుష్యాల్ని తగ్గించుకోవాలి. కేవలం ప్రైవేటు వాహనాలు, ప్రజారవాణా తిరగటానికే కాకుండా.. పాదచారులకు, సైక్లిస్టులు కూడా సురక్షితంగా తిరగగలిగేలా రోడ్లను నిర్మించుకోవాలి, పునరుద్ధరించుకోవాలి.

ప్రస్తుతం దైవాధీన సర్వీసులా ఉన్న అభివృద్ధి సామాన్య ప్రజల జీవన నాణ్యతను పెంచలేకపోతున్నందున, కరీంనగర్ పౌరులమైన మేము వినమ్రంగా కోరుతున్నాం– 'ప్రస్తుత అధికార యంత్రాంగపు పెత్తందారీ పాలన స్థానంలో ప్రజల భాగస్వామ్యమున్న పాలన వైపు మళ్లాలి.'

స్మార్ట్ సిటీ మిషన్ విధాన ప్రకటన, నిబంధనల్లో ప్రభుత్వమే చేసిన ప్రతిపాదన కూడా ఈ మౌలిక మార్పుకి అవకాశాన్నిస్తోంది.

మనకు మహాత్మాగాంధీ ఇచ్చిన పవిత్ర సూత్రం అనండి, మంత్రం అనండి.. దాన్ని ప్రమాణంగా తీసుకుంటే చాలు, అందరికీ సమానావకాశాలున్న అభివృద్ధిని అందించ గలం! ఏ అభివృద్ధి పథకాన్నయినా అమలు చేసే ముందు రెండు అంశాలను విధిగా పరిగణలోకి తీసుకోవాలని ఆయన సలహా ఇచ్చారు:

ఎ. అత్యంత పేదవాని, అత్యంత బలహీనుని ముఖాన్ని గుర్తు చేసుకోండి. మనం చేయబోయే పని వల్ల ఆ నిరుపేదకు, బలహీనుడికి ఏమైనా ఉపయోగం ఉందా? తన జీవితం మీద అతనికి అధికారాన్ని పునరుద్ధరించి, హుందాగా బతికేందుకు అవకాశం కల్పిస్తుందా?

బి. సమాజంలో మెరుగైన మార్పును కోరుకుంటున్న పైస్థాయిలోని వ్యవహారకర్తలు.. ముందుగా తామే ఆ మార్పుగా మారాలి. అంటే, ఇతరులకు చెప్పేది ముందు మనం చేసి చూపించాలి.

**8. ప్రణాళిక:**

అర్థవంతమైన, సమగ్రమైన అభివృద్ధి కోసం పేద, అణగారిన, అవకాశాలు కొరవడిన వర్గాల అవసరాల్ని తెలుసుకోవటానికి పైన పేర్కొన్న గాంధీ సూత్రాన్ని అనుసరించటం సరైన మార్గం.

కాబట్టి, వివిధ ప్రాంతాల ప్రజలను వారి ఇంటికెళ్లి కలుసుకుని సవివరంగా మాట్లాడటం, సంప్రదించటం అవసరం. పైస్థాయి వ్యవహారకర్తలుగా ఉన్న ఎం.ఎల్.ఏ, కలెక్టర్, మేయర్, మునిసిపల్ కమిషనర్, చీఫ్ ఇంజినీర్, ఆరోగ్య అధికారి తదితరులు ప్రజాప్రతినిధులతో కలిసి నడిచి వెళ్లి స్థానిక ప్రజలతో మాట్లాడితే లక్ష్యం చక్కగా నెరవేరుతుంది. దీనివల్ల క్షేత్రస్థాయి పరిస్థితులు ఎలా ఉన్నాయో అధికారులకు అర్థమై, సరైన ప్రతిపాదనల్ని, కార్యాచరణ ప్రణాళికల్ని రూపొందించగలుగుతారు. సమస్యలకు ప్రజలతో సంప్రదింపులు, చర్చలు స్మార్ట్ పరిష్కారాలను చూపగలుగుతాయి, మనం కోరుకుంటున్న 'స్మార్ట్ సిటీ' నిర్మాణానికి దారితీయగలుగుతాయి.

**9. విజ్ఞప్తి:**

స్థానిక ప్రజల భాగస్వామ్యానికి అవకాశమివ్వటం, ప్రణాళికలలో, ప్రణాళికల అమలులో వారిని భాగస్వాముల్ని చేయటం.. అభివృద్ధి ఫలితాలను అనేక రెట్లు పెంచుతాయి. ఇది ప్రజలలో ఉత్సుకతను పెంచి అభివృద్ధికి తాము ప్రధాన చోదక శక్తులమన్న భావనను కలిగిస్తుంది. అటువంటి సానుకూల, స్ఫూర్తిదాయక వాతావరణంలో సామాన్య ప్రజలు, దాతలు, కార్పొరేట్ సంస్థలు తమంతట తాము ముందుకొచ్చి స్వచ్ఛందంగా సేవలందిస్తారు. అందుకే ఉద్యోగస్వామ్య పాలన నుంచి ప్రజల భాగస్వామ్య పాలనవైపు మళ్లుదాం.

"ఆలోచన, నిబద్ధత గల కొద్దిమంది పౌరుల బృందం ప్రపంచాన్ని మార్చగలదా? అని ఎప్పుడూ సందేహించ వద్దు. నిజానికి మార్పు ఎప్పుడూ ఈ రకంగానే వచ్చింది." ✧

# కులం, మతం లేని కుటుంబం.. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ ధృవీకరణ పత్రం



ప్రపంచంలో తెలివైనవాడు ఎవరు? అన్న ప్రశ్నకు.. 'దేవుడ్ని కనిపెట్టినవాడు' అనేది అనాదిగా వినిపించే ఓ సమాధానం. భారతదేశంలో రాజకీయాల్ని చూస్తుంటే.. ఆ సమాధానం ఇప్పటికీ పనికొచ్చేదిగానే కొనసాగుతోందని ఒప్పుకోవాల్సిందే. అయినా కూడా ఎదురీదుతూ.. దేవుడితో ముడిపడిన మతాన్ని గుడ్డిగా నమ్మకుండా ఆధ్యాత్మికతతో మానవాళికి దీర్ఘకాల భవిష్యత్తును వేసే ప్రయత్నం చేసేవారి సంఖ్య ప్రపంచంలో పెరుగుతూనే ఉంది. మనదేశంలోనైతే మతంతో ముడిపడిన కులాన్ని తిరస్కరించేందుకు ఏదోక స్థాయిలో ఈతరంలో కూడా కొందరు గట్టి ప్రయత్నమే చేస్తున్నారు. వారిలో తమిళనాడుకు చెందిన ఒక మహిళ కులమతాల పట్టింపులు లేని (బహుశా) తొలి భారతీయ వనితగా ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ పొందారు.

మీడియా సమాచారం ప్రకారం.. అనంత కృష్ణన్, మణిమొళి దంపతులకు పెద్దకుమార్తె ఆమె. పోలీసులచే చిత్రహింసలకు గురై, వారికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు విడిచిన స్నేహలతకు గుర్తుగా ఆమెకు స్నేహ అని పేరు పెట్టారు. ఆమె తన ఇంటిపేరుగా తల్లి పేరులోని మొదటి అక్షరం ఎం, తండ్రి పేరులోని మొదటి అక్షరం ఏ కలిపి.. ఎం.ఏ స్నేహ అయ్యింది.

"పాఠశాలలో ఒకటో తరగతిలో చేరేటప్పుడు మొదటిసారి 'నీది ఏ క్యాస్ట్' అని అడిగారు. నాకు కులం లేదని మా తల్లిదండ్రులు చెప్పారు. పోనీ మతం అయినా చెప్పమన్నారు. మాకు కులం, మతం లేవని మా తల్లిదండ్రులు చెప్పారు" అని తెలిపారామె.

అలా మొదలైన స్నేహ జీవితంలో పాఠశాల, కళాశాల వరకు ఎక్కడా కులం, మతం అనే ఆప్షన్లు లేవు.

ఆమె సోదరీమణులు ముంతాజ్, జెన్నిఫర్ కూడా అలాగే కులం, మతం అనేవి ప్రస్తావించకుండానే విద్యాభ్యాసం ముగించారు. కుల, మత భేదాలు లేకుండానే పార్తీపరాజాతో ఆమెకు వివాహం జరిగింది. ఆమె తన ముగ్గురు అమ్మాయిలు నస్రీన్, ఆతిల జరీన్, ఆరీఫా జోసిలను కూడా కులమతాలు అంటకుండా పెంచుతున్నారు. ఏ మతానికీ చెందనివారుగా రెండు మతాలకు చెందిన పేర్లను కలిపి వారికి నామకరణం చేశారు. కులం, మతం అంటూ కొట్టుకునే సమాజానికి ఇలా స్నేహ కుటుంబం మార్గదర్శకంగా నిలిచింది.

అయితే మనుషుల్ని విభజిస్తున్న కులం, మతం తమకు లేవని అధికారికంగా తెలియజెప్పే ప్రయత్నంలో స్నేహ.. తమ కుటుంబానికి 'నో క్యాస్ట్, నో రెలీజియన్' ప్రభుత్వ సర్టిఫికెట్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. అధికారులు మాత్రం పలుమార్లు నిరాశపరిచారు. ఫలానా కులం, ఫలానా మతం అని సర్టిఫికెట్ ఇచ్చే ప్రభుత్వాలు.. ఏకులానికీ, ఏ మతానికీ చెందనివారు అని ఎందుకు సర్టిఫికెట్ ఇవ్వరు అని స్నేహ దంపతులు న్యాయపోరాటం ప్రారంభించారు. ఒక అడ్వకేట్‌గా ఆమె ఇందుకోసం దాదాపు 9 ఏళ్లు పోరాడారు. ఎట్టకేలకు సబ్ కలెక్టర్ సూచన మేరకు తిరుపత్తూర్ తహసీల్దార్ సత్యమూర్తి స్నేహ కుటుంబం ఏ కులానికి, మతానికి చెందినవారు కాదంటూ సర్టిఫికెట్ అందజేశారు. స్నేహ సర్టిఫికెట్లను, ఆమె కుటుంబ జీవనశైలిని పరిశీలించి ధృవీకరించుకున్నాక ఆమెకు నో క్యాస్ట్, నో రెలీజియన్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. మనుషులంతా సమానమే అనే సోయిని తమలో పెంచిన తల్లిదండ్రులకు స్నేహ కృతజ్ఞతలు తెలియజేశారు. తాను రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదన్నారు. ఆధిపత్య కుల ధోరణుల్ని, కుల స్పృహని ప్రజలు వదులుకునేందుకు తమ సర్టిఫికెట్ స్ఫూర్తినిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ✧

# 2019 ఎన్నికలు- ప్రజల మేనిఫెస్టో




సాంకేతికరంగంలో నిన్నటికంటే ఈరోజు మెరుగని, కానీ రాజకీయాల్లో మాత్రం ఈవేళ్టి కంటే నిన్నే మెరుగని మనదేశంలోని ప్రతి తరం ప్రజలూ వేదన చెందుతున్నారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మన తిరోగమన రాజకీయం వల్ల.. సాంకేతికత, యువతతో అందివస్తున్న అనేక కొత్త అవకాశాల్ని దేశ ప్రజలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. పరిపాలనతో సంబంధం లేకుండా ప్రజల ఓట్లను ఎలాగోలా కొల్లగొట్టటమే ధ్యేయంగా పనిచేయటమే ప్రస్తుతం రాజకీయంగా తయారైందని, అన్ని ప్రధాన పార్టీలూ ఇదే రాజకీయం చేస్తున్నాయన్నారు. జెండాలు, రంగులు తప్ప.. ఆ పార్టీల విధానాల్లో, రాజకీయ సంస్కృతిలో ఏమాత్రం తేడా లేదన్నారు. ఎన్నికలు రాగానే ఉచితాల్ని ప్రకటించటంలో పార్టీలు పోటీ పడుతున్నాయన్నారు. ఓట్ల కోసం ఉచితాలు, ఇతర తాయిలాల పేరుతో ప్రజల డబ్బునే పందేరం చేసే దురదృష్టకర సంస్కృతి నెలకొందన్నారు. ఈ ఉచితాలతో జనం జీవితాలు ఏమాత్రం బాగుపడవని కళ్ల ముందే కనిపిస్తోందన్నారు.

**లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ, కార్యనిర్వాహక అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, వజీర్, ప్రధాన కార్యదర్శి అల్లు శివరమేష్ రెడ్డి, జాతీయ నేతలు కటారి శ్రీనివాస రావు, రవి మారుత్, ఇతర రాష్ట్ర కార్యవర్గ, సీనియర్ నేతలతో కలిసి 2019 రాష్ట్ర ఎన్నికలకు ప్రజల మేనిఫెస్టో ముసాయిదా జయప్రకాష్ నారాయణ్ విజయవాడలో జరిగిన రాష్ట్ర సదస్సులో ఆవిష్కరించారు. అనేక దఫాలుగా అభిప్రాయాల సేకరణ, చర్చల అనంతరం లోక్‌సత్తా పార్టీ ఈ మేనిఫెస్టో ముసాయిదాని రూపొందించింది.**

ఉచితాలు, తాత్కాలిక తాయిలాలు కాకుండా.. ఒక్కో అసెంబ్లీ నియోజక వర్గంలో ఓట్ల కొనుగోలుకు కోట్లు ఖర్చు పెడుతున్నారని జేపీ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో అభ్యర్థి రూ.25-30 కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతోందన్నారు. గ్రామ సర్పంచ్ పదవి కోసం పలువురు లక్షలు ఖర్చు చేస్తున్నారన్నారు. వేలం పాటల్లాగా జరుగుతున్న ఎన్నికల్లో గెలిచి పదవిలోకొచ్చాక.. తాము పెట్టిన ఖర్చుకు అనేక రెట్లు అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోచుకుంటూ, మళ్లీ ఎన్నికల నాటికి మరింత కిక్కిచ్చే తాయిలాలకు పదును పెడతారు తప్ప.. రిజర్వేషన్లు, కులం, మతం వంటివి రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తారు తప్ప.. పరిపాలన గురించి, ప్రజల జీవితాల్ని బాగుచేయటం గురించి ఆలోచించరన్నారు.

ఒక పార్టీ 20, 30 కుల కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామంటే, మరో పార్టీ 137 కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని ప్రజల్ని మోసగిస్తున్నాయని జేపీ అన్నారు. రాత్రికిరాత్రే కొంతమంది పార్టీలు మార్చి, కొత్త కండువాలు

వేసుకుంటున్నారన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లోనూ, త్వరలో రాబోతున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే రాజకీయం, ఇదే తరహా పార్టీలు!.. అని జేపీ అన్నారు.

అధికారం కోసం తప్ప.. పాలన కోసం, దేశం కోసం, రాష్ట్రం కోసం ఆలోచించనప్పుడు.. ఆ పార్టీలకు ఎటువంటి విలువా ఉండదని జేపీ అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజల జీవితాల్ని బాగు చేసే ఎజెండాతో లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ విభాగం రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సమగ్ర మేనిఫెస్టోను రూపొందించిందన్నారు. 2019 ఎన్నికలు గుణాత్మక మార్పునకు నాంది పలకాలన్నారు. 2019 తర్వాత దేశంలో, రాష్ట్రంలో మార్పునకు అవకాశాలు మెరుగవుతాయని, దీనికి అందరూ సిద్ధపడాలని అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత చోటుచేసుకోనున్న పెను మార్పులను సరైన దిశలోకి మళ్లించే ఎజెండాగా లోక్‌సత్తా పూర్తిస్థాయి మేనిఫెస్టో ఉంటుందన్నారు.

**ప్రజలు రాజకీయ నేతలు, అధికారుల మీద ఆధారపడటాన్ని తగ్గించేలా ప్రణాళిక**

ప్రజలు తమ అవసరాలకు రాజకీయ నేతలు, అధికారుల మీద ఆధారపడటం తగ్గి ప్రజాస్వామ్యం పటిష్టమయ్యేలా లోక్‌సత్తా ఎన్నికల ప్రణాళిక ఉంటుందని జేపీ అన్నారు. ఎటువంటి ఆసరా లేని కొద్దిమందికి ఇవ్వాల్సిన తాత్కాలిక సాయాల్ని ఓట్ల కోసం ప్రభుత్వాలు ప్రతి ఒక్కరికీ వందేరం చేయటం మొదలుపెట్టటంతో.. అసలు ప్రభుత్వాలు చేయాల్సిన మౌలికమైన పనులు మూలన పడ్డాయన్నారు. జనం జీవితాల్ని బాగు చేసి దేశాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లగలిగే ప్రతి అంశంలోనూ మనదేశం ప్రపంచంలోని 49 ముఖ్యమైన దేశాల్లో చివరి నాలుగైదు స్థానాల్లో ఉందన్నారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వం గంటకు రూ.500 కోట్లు ఖర్చు పెడుతుందని, కానీ రూ.50 కోట్లతో ఓ ప్రలోభపెట్టే స్కీమును ప్రారంభించి ఘనకార్యం చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. వాళ్లు ఆ ప్రకటన చేసేలోగానే రూ.50 కోట్లు ఖర్చయిపోతాయన్నారు. ఇది చాలా దారుణమైన అంశమన్నారు.

**ఉచితంగా ఇవ్వాల్సినవి ఏమిటో చర్చ జరగాలి**

అన్నీ ఉచితంగా ఇవ్వాల్సిన కొద్దిమందిని మినహాయిస్తే.. మొత్తం అందరు ప్రజలకూ ఏది ఉచితంగా ఇవ్వాలీ అనే అంశంపై చర్చ జరగాలని జేపీ అన్నారు. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటివి ఉచితంగా అందాలన్నారు. ఈ రంగాల్లోని ఖర్చుల్లో కోత లేకుండా, మిగిలిన పథకాలన్నిటినీ కలిపివేసి ప్రతి పేదవానికి నెలకు రూ.2,000 చొప్పున బ్యాంకుల్లో నేరుగా జమ చేసే సార్వత్రిక ఆదాయ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. బడ్జెట్ నుంచి నేరుగా ప్రజలకు 15 శాతం కేటాయించటం మేలన్నారు. దీనివల్ల అవినీతికి కూడా ఆస్కారముండదన్నారు.

2019 ఎన్నికల తర్వాత జాతీయస్థాయిలో ప్రాంతీయ పార్టీల ప్రభావం గణనీయంగా పెరుగుతుందని, ప్రాంతీయ పార్టీల సహకారం లేకుండా ఏ జాతీయ పార్టీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని జేపీ అన్నారు. ఈ ఒరవడి దాదాపు 25 ఏళ్లపాటు ఉండవచ్చన్నారు. ఇది అధికార వికేంద్రీకరణకు, మూడో దశ ఫెడరలిజానికి దారితీయాలని, రాష్ట్రాల్లో పాలనా సంస్కరణలు చోటుచేసుకుని ప్రజలు ఎక్కడికక్కడ పాలనలో భాగస్వాములు కావాలని అన్నారు. దేశ ఐక్యత దెబ్బతినకుండా రాష్ట్రాలకు అధికారాలను బదిలీ చేయాలన్నారు. ఈ అవకాశాల్ని ఉపయోగించుకుని.. విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, స్థానిక స్వపరిపాలనల్ని ప్రజలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటేస్తేనే ప్రజాస్వామ్యం కాదని, ప్రజలందరికీ సమన్యాయం అందితేనే అది ప్రజాస్వామ్యం అవుతుందని అన్నారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం చాలా అంశాల్లో పొరపాట్లు చేసి ఉండొచ్చని, కానీ విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టి వ్యవస్థను బాగు చేస్తోందని అన్నారు. ఎన్నికలు రాగానే పోటాపోటీ తాయిలాలతో ప్రజల జీవితాలతో చెలగాటమాడకుండా, పార్టీలు ఈ అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. వీటన్నింటినీ 11 పేజీల తన ముసాయిదా మేనిఫెస్టోలో లోక్‌సత్తా పొందుపరిచిందన్నారు.

ఎన్నికల్లో పోటీపై త్వరలో నిర్ణయం ప్రకటిస్తామని, కానీ ఉద్యమపార్టీగా తమ ఎజెండాను ప్రజల ముందు ఉంచామని జేపీ తెలిపారు. దీనిపై విస్తృత చర్చ జరగాలన్నారు.




లోక్‌సత్తా మేనిఫెస్టోలో 8 అంశాలు కీలకంగా ఉన్నాయని జేపీ వివరించారు. స్థానిక ప్రభుత్వాల్లో అంబుడ్స్‌మన్ ఏర్పాటు, రాష్ట్రస్థాయిలో లోకాయుక్తను బలోపేతం చేయుటం, ఏసీబీని లోకాయుక్త పరిధిలోకి తేవటం ద్వారా అవినీతి నియంత్రణకు బలమైన చట్టబద్ధ వ్యవస్థ, అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్య సేవలు, సామాజిక న్యాయం, సార్వత్రిక ఆదాయం, పౌర హక్కుల పరిరక్షణ, మద్యంతో రాజకీయానికి స్వస్తి-గ్రామాల్లో మద్యం అమ్మకాల నిషేధం, ప్రాథమిక అవసరాలను తీర్చే స్థానిక ప్రభుత్వాలు, లాభసాటి వ్యవసాయం-కౌలుదారులకు ఊరట, పారిశ్రామికాభివృద్ధి-ప్రాంతీయ అసమానతల తగ్గింపు-యువతకు ఉపాధి అవకాశాలు.. తదితర అంశాలు ఇందులో ఉన్నాయన్నారు. ప్రతి అంశాన్నీ ఎలా అమలు చేస్తామో, ఏ రీతిలో నిధుల్ని సమీకరిస్తామో, బడ్జెట్ పరిధిలోనే వ్యయాన్ని ఎలా నియంత్రిస్తామో వివరంగా ప్రజల ముందుంచుతామన్నారు (ముసాయిదా మేనిఫెస్టోలోని పూర్తి వివరాల్ని లోక్‌సత్తా టైమ్స్ తదుపరి సంచికలో ప్రచురిస్తామని మనవి చేస్తున్నాం).

**దేశ ఐక్యత అంటే మోదీ భక్తులు కాదు..**

**రాష్ట్ర ప్రయోజనాలు అంటే చంద్రబాబు భక్తులు కాదు**

ఆంధ్రప్రదేశ్‌కు విభజన సందర్భంగా ఇచ్చిన హామీల్ని యూనియన్ ప్రభుత్వం నెరవేర్చలేదని, తాము చొరవ తీసుకుని ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల బృందం తేల్చిందని జేపీ అన్నారు. ఇది ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత వ్యవహారం కాదన్నారు. 'దేశ ఐక్యత కావాలన్నవారు మోదీ భక్తులు కాదు.. దేశం అందరిదీ.. మోదీ సొంతం కాదు, రాష్ట్రానికి న్యాయం జరగాలన్న వారంతా చంద్రబాబు భక్తులు కాదు.. ఈ రాష్ట్రం అందరిదీ" అని జేపీ వ్యాఖ్యానించారు. మన ఆత్మగౌరవాన్ని పెంచేందుకు ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగాన్ని ఆత్మన్యూనతతో నాశనం చేసుకుంటున్నామన్నారు. రాష్ట్రాల్లో చీమ చిటుక్కుమన్నా కేంద్ర ప్రభుత్వం స్పందించటమేంటి? అని ప్రశ్నించారు. రాష్ట్రాల్లోని విషయాలపై కేంద్రం పెత్తనం తగదన్నారు. ఇతర రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ఏపీకి రావాల్సిన హక్కులను సాధించుకోవాలన్నారు. ఇది పూర్తిగా సాధ్యమన్నారు. రాష్ట్ర ఉమ్మడి ప్రయోజనాల గురించి ఆలోచించని తెలుగు ప్రజలను చూసి సిగ్గుపడుతున్నానని, ప్రజలను సంఘటితం చేయుటవే లక్ష్యంగా లోక్‌సత్తా మేనిఫెస్టో పనిచేస్తుందని అన్నారు. ప్రజాప్రయోజనాలకు అన్యాయం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా లోక్‌సత్తా భావజాలం అజరామరమన్నారు.


**డబ్బు ఇవ్వనివారిని ఓడించే పరిస్థితి మారాలి**

డబ్బు ఇవ్వని వారిని ప్రజలు ఓడించే పరిస్థితి ప్రస్తుతం నెలకొందని, ఓట్ల కోసం సమాజాన్ని బలిపెట్టకూడదన్నదే లోక్‌సత్తా ఆలోచనని జేపీ స్పష్టం చేశారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతావనిలో జరిగిందేదో జరిగిపోయిందని, ఇప్పటికైనా భవిష్యత్తును మార్చుకోవాల్సిన అవసరముందన్నారు. మన బిడ్డలు గర్వించేలా మన వ్యవస్థను మార్చాలని, ప్రపంచ అత్యుత్తమ దేశాల్లో కనీసం తొలి 15 స్థానాల్లోకి భారతదేశాన్ని చేర్చేందుకు కృషి చేయాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. ✧

# వెనుకబడిన ప్రాంతాలకు కేంద్రం మొండిచెయ్యి

**- కొణతాల రామకృష్ణ,**
మాజీ ఎంపీ, మాజీ మంత్రి, కన్వీనర్, ఉత్తరాంధ్ర చర్చా వేదిక

**బుందేల్‌ఖండ్ ప్యాకేజి కింద ఆ రాష్ట్రానికి 2009 నుండి 2017 వరకు రూ.6,374 తలసరి గ్రాంట్‌గా ఇవ్వగా, ఆంధ్రప్రదేశ్‌కు మూడేళ్లలో వెనుకబడిన ప్రాంతాలకు విడుదల చేసిన మొత్తం తలసరి రూ.417 మాత్రమే కావడం గమనార్హం.**



రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక ఆందోళన కలిగించిన అంశం దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి. ఈ విషయమై నాటి యుపిఎ ప్రభుత్వం కసరత్తు చేసింది. విభజన బిల్లులో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి నిర్దుష్టమైన అంశాలను చేర్చింది. ఆ తర్వాత ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్ 2014 ఫిబ్రవరి 14న పార్లమెంట్‌లో చేసిన ప్రకటనలో సహితం ఈ అంశంపై స్పష్టమైన హామీ ఇచ్చారు.

ప్రధాని ప్రకటనలోని మూడవ అంశం 'ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాల, ముఖ్యంగా రాయలసీమ, ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ జిల్లాలకు బిల్లులో ఇప్పటికే ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి ఉంది. ఈ అభివృద్ధి ప్యాకేజి ఒడిశాలోని కెబికె (కోరాపుట్, బలంగీర్, కలహండి) స్పెషల్ ప్యాకేజి, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలోని బుందేల్‌ఖండ్ స్పెషల్ ప్యాకేజి తరహాలో ఉంటుంది' అని తెలిపారు.

ఎన్నికల ప్రచారం సందర్భంగా రాష్ట్రానికి వచ్చిన నేటి ప్రధాని నరేంద్ర మోదీ సహితం బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజి ఇస్తామని వాగ్దానం చేశారు. పదేళ్ల కాలంలో మిగిలిన జిల్లాల స్థాయికి అభివృద్ధి విషయంలో ఈ జిల్లాలను సమానస్థాయికి తీసుకురావడమే ఈ సందర్భంగా ప్రధాన ఉద్దేశం. అయితే ఈ విషయంలో తన చట్టబద్ధ బాధ్యతను, ప్రధానమంత్రి స్వయంగా పార్లమెంట్‌లో ఇచ్చిన హామీని నరేంద్ర మోదీ ప్రభుత్వం గాలికి వదిలేసి చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టం అవుతుంది.

ఏపీలో మూడు భిన్నమైన ప్రాంతాలున్నాయి. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ. వీటి ఆర్థిక వృద్ధిలో తీవ్రమైన అంతరాలున్నాయి. ఏడు జిల్లాలు కలిగిన ఉత్తర కోస్తా, రాయలసీమలను రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలుగా పరిగణిస్తున్నారు. మొత్తం 13 జిల్లాల్లో ఏడు జిల్లాలు అంటే రాష్ట్రంలో సగం కన్నా ఎక్కువ ప్రాంతమని గమనించాలి.

గత నాలుగున్నరేళ్లలో ఈ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేసింది శూన్యమనే చెప్పాలి. జిల్లాకు సంవత్సరానికి రూ.50 కోట్లు చొప్పున మూడు సంవత్సరాలు మొత్తం రూ.1,050 కోట్లను ఇచ్చారు. నాలుగో సంవత్సరం ఇవ్వనే లేదు. మిగిలిన రెండు ఏళ్లకు రూ.700 కోట్లు ఇవ్వవలసి ఉంది. గత ఏడాది రూ.350 కోట్లు విడుదల చేసి, తిరిగి బ్యాంకు నుండి వెనుకకు తీసేసుకున్నారు. బహుశా భారతదేశంలో గతంలో ఏనాడూ ఒక రాష్ట్ర ప్రభుత్వ బ్యాంకులో జమ చేసిన మొత్తాన్ని, ఆ ప్రభుత్వ అనుమతి లేకుండా వెనుకకు తీసేసుకోవడం జరిగి ఉండదు. అందుకు ఎటువంటి కారణం కూడా ఇప్పటివరకు చెప్పనే లేదు.

వెనుకబడిన ఏడు జిల్లాల తలసరి జిఎస్డీపీ దక్షిణ కోస్తా ప్రాంతం కంటే 15 శాతం, ఏపీ సరాసరి కంటే 8 శాతం తక్కువగా ఉంది. ఈ అగాధం గత నాలుగేళ్లలో మరింతగా పెరుగుతున్నది. 2017-18 నాటికి ఈ ప్రాంతాల జిఎస్డీపీ దక్షిణ కోస్తా ప్రాంతం కంటే 20 శాతం, ఏపీ సరాసరి కంటే 10 శాతం తక్కువగా ఉంది. ఈ ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటి వరకు కేంద్రం ఒక నిర్దిష్టమైన ప్రణాళికను కూడా ప్రకటించలేదు. ఈ దిశలో కేంద్రంలోని పెద్దలు ఎటువంటి ఆలోచనలు చేసినట్లు లేదు.

జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ అంచనాల ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పదేళ్ల కాలంలో రూ.26 లక్షల కోట్ల మూలధనం అవసరం కాగలదు. అందులో రూ.22 లక్షల కోట్లు అంతర్గత పొదుపు ద్వారా పెంపొందుతాయి. మిగిలిన రూ.4 లక్షల కోట్లను ఇతర మార్గాల ద్వారా సేకరించాలి. అంటే ఏపీ బయటి నుండి అవసరమైన పెట్టుబడులలో 85 శాతం కేవలం వెనుకబడిన ప్రాంతాలకే మళ్లవలసి ఉంది. వెనుకబడిన ప్రాంతాల జిఎస్డీపీ తక్కువగా ఉండటం, తక్కువ ఆదాయాల కారణంగా అంతర్గత పొదుపుకూడా తక్కువగా ఉండటంతో పెట్టుబడుల మొత్తం పెరగాలి.

మొదటి ఐదేళ్లకు ఏపీకి పెట్టుబడుల అవసరాలు రూ.72,200

కోట్లు కాగా, అందులో బయటి నుంచి ప్రైవేట్ పెట్టుబడులు సుమారు రూ.36,100 కోట్లు రాగా, మిగిలిన సగం ప్రభుత్వం నుండి మాత్రమే రావలసి ఉంది. అంటే, ఏపీకి వచ్చే ఐదేళ్లలో రూ.1.03 లక్షల కోట్లు భర్తీ కావాలి. ప్రాంతీయ అసమానతల్ని తొలగించాలని లక్ష్యంగా పెట్టుకొంటే మొత్తం పెట్టుబడులలో మూడో వంతును వెనుకబడిన ప్రాంతాలలో పెట్టవలసి ఉంటుంది.

వెనుకబడిన ఈ ఏడు జిల్లాల సామాజిక, ఆర్థిక సూచికలు ఆయా ప్రాంతాల వెనుకబడినతనానికి నిలువెత్తు నిదర్శనంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ వెనుకబడినతనానికి మూలకారణం ఈ ప్రాంతాల సూచికలు ప్రత్యేక క్యాటగిరీ రాష్ట్రాల సూచికలతో సమానంగా లేదా అంతకన్నా తక్కువగా ఉండటమే. తక్కువ అక్షరాస్యత స్థాయి, అక్షరాస్యతలో ఎక్కువగా లింగవివక్షత, అధ్వాన్న నీటి సరఫరా, పేదరికం వంటి కారణాలు ఈ ప్రాంతాల వెనుకబాటుకు దారితీస్తున్నాయి. అందుచేత ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక వ్యూహం, ప్రణాళిక అవసరముంది.

బుందేల్‌ఖండ్ అభివృద్ధి ప్యాకేజికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం 2009-12 వరకు మూడేళ్ల కాలానికి రూ.7,226 కోట్లు కేటాయించింది. ఆ తర్వాత 2012-17 వరకు వెనుకబడిన ప్రాంతాల గ్రాంట్ కింద రూ.4,400 కోట్లు మంజూరు చేసింది. అంటే మొత్తం మీద రూ.11,668 కోట్లు ప్రత్యేక గ్రాంట్‌గా ఇచ్చింది. అంటే, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలోని 1.83 కోట్ల జనాభాతో 13 జిల్లాల మేర ఉన్న బుందేల్‌ఖండ్‌కు తలసరి రూ.6,374 ఇచ్చినట్లు అయింది.

ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన జిల్లాల్లో మొత్తం జనాభా 2.52 కోట్ల మంది. 2009 ధరల ప్రకారం బుందేల్‌ఖండ్ ప్యాకేజి తరహాలో ఉత్తర కోస్తా, రాయలసీమలో భాగంగా భావించదగిన ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్‌తో కలిపి రాయలసీమకు తలసరి కేటాయింపు చేస్తే జనాభా, 5 శాతం ద్రవ్యోల్బణం ప్రకారం లెక్కేస్తే బుందేల్‌ఖండ్ ప్యాకేజికి అనుగుణంగా ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు గ్రాంట్‌గా రూ.25,000 కోట్లు ఇవ్వవలసి ఉంటుంది. స్థూల బడ్జెట్ పెరుగుదలకు, మధ్య వ్యవధి కాలంలోని ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేస్తే ఈ మొత్తం చాలా ఎక్కువ అవుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2014 అక్టోబర్ 16న వ్రాసిన లేఖలో వెనుకబడిన ప్రాంతాలకు, ముఖ్యంగా రాయలసీమ, కోస్తా ప్రాంతాలకు 2014-15 నుంచి ఐదేళ్ల కాలానికి రూ.24,350 కోట్ల ప్రత్యేక సాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరింది. ద్రవ్యోల్బణం, జనాభాపరంగా సర్దుబాటు చేస్తే రాష్ట్రం అడిగిన సాయం దాదాపుగా బుందేల్‌ఖండ్ ప్యాకేజితో సమానంగా ఉంది.

ఈ లేఖకు స్పందిస్తూ 2014 డిసెంబర్ 2న అప్పటి ప్రణాళికా సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అప్పటికే కొనసాగుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాలతో కలిసిపోయే అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ప్యాకేజి కింద అదనపు నిధుల్ని ఇచ్చే అంశాన్ని పరిశీలించడానికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజిని నిశితంగా అధ్యయనం చేయాల్సి ఉన్నదని ఆ సమావేశంలో ప్రణాళికా సంఘం స్పష్టం చేసింది. దీంతో, తిరిగి 2015 జనవరి 16న రాష్ట్ర ప్రభుత్వం పున్ససమీక్షించిన మరో లేఖను పంపింది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక సాయం ఇవ్వడానికి రంగాల వారీగా అవసరమైన కేటాయింపులను కోరుతూ ప్రాథమిక అంచనాలను పంపింది. తర్వాత ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి ప్రతిపాదనను కేంద్ర మంత్రిత్వశాఖలు/విభాగాల పరిశీలనకు పంపారు. అయితే, 2014-15 నుంచి 2016-17 వరకు మూడు బడ్జెట్ సంవత్సరాలలో కేవలం రూ.1,050 కోట్లు, అంటే జిల్లాకు సంవత్సరానికి రూ.50 కోట్లు మాత్రమే వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి కింద అందింది.

బుందేల్‌ఖండ్ ప్యాకేజి కింద ఆ రాష్ట్రానికి 2009 నుండి 2017 వరకు రూ.6,374 తలసరి గ్రాంట్‌గా ఇవ్వగా, ఆంధ్రప్రదేశ్‌కు మూడేళ్లలో వెనుకబడిన ప్రాంతాలకు విడుదల చేసిన మొత్తం తలసరి రూ.417 మాత్రమే కావడం గమనార్హం. నవ్యాంధ్రలోని వెనుకబడిన ప్రాంతాలపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి ఈ కేటాయింపే ఒక తిరుగులేని నిదర్శనం.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజి కింద ఏపీకి కేంద్రం రూ.1,050 కోట్లు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,641.50 కోట్ల అంచనా వ్యయంతో 25,007 పనులను మంజూరి చేసింది. వీటిల్లో 14,512 పనులు పూర్తయ్యాయి. 5,364 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,034.34 కోట్లకు ఇప్పటికే వినియోగపత్రాలను ఇచ్చేసింది. రాష్ట్రానికి రూ.666 కోట్ల తదుపరి నిధులను తర్వాతి రెండేళ్లకు మంజూరు చేయాలని నీతి ఆయోగ్ నవంబర్ 8, 2018న ఆర్థిక మంత్రిత్వ శాఖకు సూచించింది. కానీ కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదు.

ఏపీలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి, విభజన చట్టంలో పేర్కొన్న మేరకు తనకున్న బాధ్యతకు పొంతన లేనట్లు ఉన్నదని నిపుణుల కమిటీ వ్యాఖ్యానించింది. రూ.24,350 కోట్ల ప్రత్యేక ప్యాకేజిని నిర్ణీత కాలవ్యవధి పద్ధతిలో ఐదేళ్లలోపు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ప్రాధాన్య చర్యలను తీసుకోవాలని సూచించింది. ఇప్పటికైనా కేంద్రం ఈ విషయంలో తన వివక్షకు స్వస్తి పలికి రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాలి. ✧

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

# బస్సులు నడపటమే చేతగానివాళ్లు సరైన పాలన ఎలా అందించగలరు?



ఒకచోట నుంచి ఇంకోచోటికి వేగంగా, సురక్షితంగా వెళ్లటానికి రవాణా వసతుల్ని అందించటం ప్రభుత్వాల మౌలిక బాధ్యతని, ఆర్థికవృద్ధికి మార్గమని.. బస్సుల్నే సక్రమంగా నడపటం చేతగానివాళ్లు సరైన పాలనని ఎలా అందించగలరు అని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం అధ్యక్షుడు వెంకటరమణబాబు అన్నారు. బళ్లారి నుంచి రాయదుర్గం వైపు వస్తున్న బస్సులో ఇంజిన్ నుంచి ఆయిల్ లీకేజీ కారణంగా బస్సు నిలిచిపోయి ఇబ్బంది పడుతున్న ప్రయాణీకులతో ఆయన మాట్లాడారు. చాలా చోట్ల రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, కానీ ఈ రూట్‌లో రోడ్డు బాగున్నా బస్సులు సరిగా లేవన్నారు. కాలం చెల్లిన బస్సుల్ని తొలగించి కొత్త బస్సుల్ని నడపాలని, గ్రామాలకు సర్వీసుల్ని విస్తరించాలని బాబు డిమాండ్ చేశారు.

# మరుగుదొడ్ల నిర్వహణను కూడా పట్టించుకోండి



స్వచ్ఛభారత్‌లో భాగంగా మరుగుదొడ్లను నిర్మించటంలో అక్రమాలు చోటుచేసుకోవటం ఒక సమస్యయితే, ఆ మరుగుదొడ్ల నిర్వహణ కూడా పలుచోట్ల సక్రమంగా లేదని వెంకటరమణబాబు అన్నారు. మరుగుదొడ్ల నిర్వహణను కూడా అధికారులు, గ్రామ కమిటీలు పట్టించుకోవాలన్నారు. గుమ్మఘట్ట మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో ఎంఆర్ఈజీఎస్ వారి సహకారంతో సోక్‌పిట్ పేరుతో మరుగుదొడ్ల పక్కన నిర్మించిన గుంతలను ఆయన పరిశీలించారు. గుంతలు తవ్వి నెలరోజులు దాటిపోయినా అలా వదిలేశారన్నారు. తమ ఒక్క గ్రామంలోనే 50 దాకా గుంతలు తవ్వి వదిలేశారని గ్రామస్తులు బసవరాజు, గురుసిద్ధ, ఆంజనేయులు, శంకరప్ప, వసంత, మహేష్ తదితరులు చెప్పారు. గుంతల్ని వదిలేయటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని, వాటికి తగిన మరమ్మతులతో సురక్షిత ఏర్పాట్లు చేయాలని బాబు కోరారు.

# మినీ, సబర్బన్ బస్సుల్ని తిప్పండి



సామాన్య ప్రజల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని.. విజయనగరం పట్టణంలోని అన్ని ప్రాంతాలనూ కవర్ చేసేలా మినీ, సబర్బన్ బస్సుల్ని తిప్పాలని లోక్‌సత్తా పార్టీ నేతలు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎ.అప్పలరాజును కోరారు. కాంప్లెక్స్ నుంచి పట్టణంలోని వివిధ ప్రాంతాలకు, శివార్ల నుంచి పెద్దాస్పత్రికి రావటానికి ఆటోల బాదుడు భారంగా మారిందన్నారు. లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.నాగభూషణం ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు, కార్యదర్శి తాత్రాజు రాజారావు, పతివాడ చంద్రరావు, పోలుపర్తి అప్పారావు, చిన్నారావు తదితరులు ఆర్ఎంను కలిశారు. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని రీజినల్ మేనేజర్ సానుకూల హామీ ఇచ్చారని నేతలు తెలిపారు.

# ఓటుపై మీ మాట చెప్పండి!
# -'నిర్బంధ ఓటింగ్' సహా పలు అంశాలపై ఈసీ సర్వే-



ఓటరు జాబితాలు, ఎన్నికల నిర్వహణలో ఇటీవల పలు విమర్శలెదుర్కొంటున్న కేంద్ర ఎన్నికల సంఘం సర్వే మార్గం పట్టింది. దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణకు నడుం బిగించింది. దీంతో.. పాలకుల గుప్పెట్లోని ఇంటెలిజెన్స్ ఏజన్సీలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నియమించుకున్న కన్సల్టెన్సీలతోపాటు ఎన్నికల సంఘం కూడా సంధించే ప్రశ్నలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కానున్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లతో (ఈవీఎంలు) కచ్చితమైన ఫలితాలు వస్తాయని భావిస్తున్నారా, ఓటింగ్‌ను తప్పనిసరి చేస్తే బాగుంటుందా? ఎన్నికల్లో కండబలం, ధన ప్రభావం పెరుగుతున్నాయని భావిస్తున్నారా? గత ఎన్నికల్లో ఓటు వేశారా? ఈ ఎన్నికల్లో మీకు ఓటు ఉందా?.. ఇలా అనేక అంశాలకు సంబంధించిన ప్రశ్నలను ఎన్నికల సంఘం సర్వే ద్వారా సంధిస్తున్నారు. ఓటరు నమోదు మొదలుకొని ఓటు వేసే వరకూ అనేక అంశాలపై ఈ భారీ సర్వేలో అభిప్రాయాలను ఈసీ సేకరిస్తోంది. అన్ని రాష్ట్రాల్లోనూ ఈ సర్వేను తప్పనిసరి చేసింది. ఆంధ్రప్రదేశ్, ఇంకొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే సర్వే ప్రక్రియ ప్రారంభమైందని, తెలంగాణ, మరికొన్ని రాష్ట్రాల్లో ప్రారంభంకానుందని మీడియాలో వస్తున్న కథనాలు తెలియజేస్తున్నాయి. ఓటు వేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ.. పెద్దఎత్తున ప్రచారం ప్రచారం చేస్తున్నా ఓటింగ్ శాతం తక్కువగా

### తప్పనిసరి ఓటింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణకు 2016లోనే అంకురార్పణ

నిర్బంధ ఓటింగ్‌పై అభిప్రాయాలు తీసుకునేందుకు 2016లోనే అంకురార్పణ జరిగింది. తప్పనిసరి ఓటింగ్‌పై సర్వే చేస్తామని అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) నసీం జైదీ చెప్పారు. అయితే నిర్బంధ ఓటింగ్ ఆచరణ సాధ్యంకాదని తాము భావిస్తున్నట్లు తెలిపారు.

'కొన్ని దేశాల్లో అమలవుతున్న నిర్బంధ ఓటింగ్‌పై గతంలోనూ చర్చలు జరిగాయి. అయితే అది అంత ఆచరణ సాధ్యం కాదని గుర్తించాం. అయినా అభిప్రాయాలను స్వీకరిస్తాం' అని జైదీ అన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించడంపై ఢిల్లీలో నిర్వహించిన ఓ సదస్సు సందర్భంగా ఆయనీ వ్యాఖ్యలు చేశారు. 'సమ్మిళిత, వాస్తవ, నైతిక భాగస్వామ్యానికి ఓటరు విద్య' పేరుతో భారత ఎన్నికల కమిషన్ తొలిసారిగా ఈ ప్రపంచ సదస్సుని నిర్వహించింది. ఈ సదస్సులో 27దేశాలకు చెందిన ఎన్నికల సంఘాల అధికారులతోపాటు 200మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

'చాలా దేశాల్లో పోలింగ్ శాతం నానాటికీ తగ్గుతోంది. కొన్ని వర్గాలు ఓటింగ్‌పై అయిష్టత చూపుతున్నాయి. ఇందుకు ఎన్నో కారణాలున్నాయి. వీటన్నింటిపైనా అధ్యయనం చేయాల్సి ఉంది' అని జైదీ అన్నారు. క్రమపద్ధతిలో ఓటర్లలో అవగాహన పెంచటం, ఎన్నికల భాగస్వామ్యం వంటి కార్యక్రమాల ద్వారా 2014 పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగిందని, యువత కూడా అధిక సంఖ్యలో పాల్గన్నారని తెలిపారు. ఓటరు విద్యపై అన్ని దేశాలు అభిప్రాయాలు పంచుకోవడానికి గ్లోబల్ నాలెడ్జి నెట్‌వర్క్‌ను, వాయిస్ డాట్‌నెట్‌ను ప్రారంభించాలని జైదీ సూచించారు.

**ముందు పోస్టాఫీసుల్ని శాశ్వత ఓటరు నమోదు కేంద్రాలుగా మార్చండి**

ఈ సర్వే చేయటం మీదకన్నా, ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా ఉండటానికి పోస్టాఫీసుల్ని శాశ్వత ఓటరు నమోదు కేంద్రాలుగా చేయటం మీద ఎన్నికల సంఘం మొదట దృష్టి పెట్టాలని లోక్‌సత్తా నేతలు అభిప్రాయపడ్డారు. పోస్టాఫీసుల్లో ఓటరు నమోదు.. పూర్తిగా ఎన్నికల సంఘం పరిధిలోని అంశమన్నారు.

తమ ఓటుకు, తాము కడుతున్న పన్నుల డబ్బుకు, తమ జీవితంలో మార్పునకు సంబంధం అర్థంకాని పాలనా, ఎన్నికల వ్యవస్థల వల్ల ఓటర్లు చాలామంది తొలుత ఉత్సాహంగా ఓటు వేసినా, ఆ తర్వాత పెద్దఆసక్తి చూపటం లేదని లోక్‌సత్తా నేతలు అన్నారు. అభ్యర్థుల నుంచి అయినకాడికి దండుకోవటం, తాయిలాలను కోరుకోవటం, కులం, మతం, ప్రాంతం వంటి ఆటవిక ఉద్రేకాలకు లొంగిపోవటం వంటి వాటి వల్ల పలువురు ఓట్లు వేస్తున్నారని, ఇంకొందరు వీలు కుదిరితేనే ఓటేయటం చేస్తున్నారని అన్నారు. ఓటర్ల నమోదుకు పోస్టాఫీసులను శాశ్వత నోడల్ ఏజన్సీగా చేయటాన్ని తాను పూర్తి చేసి.. మిగిలిన సంస్కరణల కోసం రాజకీయ పార్టీలను, పౌరసమాజాన్ని సమీకరించేందుకు ఎన్నికల సంఘం కృషి చేయాలని వారు సూచించారు.




ఉండటానికి గల కారణాలపై సర్వేలో తెలుసుకుంటారు.

సర్వే ఏయే అంశాలపై చేయాలి, ఎలా చేయాలి, ఓటర్ల నుంచి నమోదు చేయాల్సిన వివరాలేంటి అన్న దానిపై కేంద్ర ఎన్నికల సంఘం టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్)తో 18 పేజీల పత్రాన్ని తయారు చేయించిందని సమాచారం. దీన్ని అన్ని రాష్ట్రాలకు పంపి.. వీలైనంత త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాలని ఆదేశించింది. తెలుగు రాష్ట్రాల్లో సర్వే బాధ్యతను ఆర్థిక, సామాజిక అధ్యయనాల సంస్థ (సెస్)కు అప్పగించారు.

**ఏపీలో 17,000 మంది నుంచి**


ఆంధ్రప్రదేశ్‌లో విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, నరసరావుపేట, అనంతపురం, తిరుపతి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో, ఒక్కో లోక్‌సభ నియోజకవర్గ పరిధి నుంచి మూడేసి శాసనసభ స్థానాలను సర్వేకు ఎంపిక చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎక్కువ, తక్కువ ఓట్లు వచ్చిన గ్రామాలను ఎంపిక చేశారు. మొత్తం 17,000 మంది నుంచి అభిప్రాయాలను సేకరించనున్నారు. తెలంగాణలో మరికొన్ని రోజుల్లో ప్రారంభమవుతుంది.

**భయపెడితే ఓటేశారా?**

ఇటీవలి ఎన్నికల్లో మీరు ఓటు వేశారా, అందుకు కారణాలేంటి, దేశంలో పరిస్థితులను మీ ఓటు మారుస్తుందనా లేక హక్కుగా భావించి వేశారా? అసలు అభ్యర్థిని చూశారా? మీరు ఏదైనా పార్టీకి సానుభూతిపరులా, ఎవరైనా భయపెడితేనో లేక మత పెద్ద కానీ, కుటుంబ పెద్ద కానీ చెబితే ఓటు వేశారా.. లాంటి వివరాలను కూడా సేకరించనున్నారు. పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలు, ఎన్నికల్లో దౌర్జన్యాలు.. ఇలా అన్నిటి గురించీ కూపీలాగుతారు. ఓటింగ్‌ను తప్పనిసరి చేయాలా, దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతున్నాయా వంటి పలు వివరాలను సర్వేలో సేకరిస్తారు. ఎవరి ద్వారా ప్రచారం చేయిస్తే ఓటర్ల నమోదు, పోలింగ్‌పై ప్రభావం పడుతుంది, ప్రచారం ఎలా ఉండాలి? వంటి అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. ✧

# ఎన్నికల ఫార్ములా.. ఏపీ బడ్జెట్ 2019

తెలంగాణలో సంక్షేమం పేరుతో అమలవుతున్న పథకాలు కేసీఆర్ రెండోసారి విజయం వెనుక ప్రధాన పాత్ర పోషించాయన్న అంచనాల నేపథ్యంలో, రాష్ట్రంలో తన పట్ల కనిపించకుండా పొంచి ఉన్న అసంతృప్తిని అధిగమించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈసారి బడ్జెట్‌లో పలు పథకాలను విస్తరించారు, కొత్తవి ప్రకటించారు. యూనియన్ బడ్జెట్లో తాయిలాల్ని ప్రకటిస్తూ 'ఇది ట్రైలర్ మాత్రమే' అన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ



**ఈ బడ్జెట్‌లో కొత్తగా ప్రకటించిన, విస్తరించిన సంక్షేమ పథకాలు**

- పేదలకు గృహనిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రూ.500 కోట్లు
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలకు రూ.400 కోట్లు
- వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయినప్పుడు రైతుని ఆదుకునేందుకు ఉద్దేశించిన 'మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్' రూ.500 కోట్ల నుంచి వెయ్యి కోట్లకు పెంపు
- పశువుల బీమా రూ.50 కోట్ల నుంచి 200 కోట్లకు..
- 21 బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా ప్రకటించడంతోపాటు ఇటీవలే తొమ్మిది కార్పొరేషన్లను వెల్లడించిన ప్రభుత్వం.. వాటికి రూ.3,000 కోట్లను కేటాయించింది
- నిరుద్యోగ యువతకు ప్రస్తుతం నెలనెలా రూ.1,000 నిరుద్యోగ భృతి ఇస్తున్న ప్రభుత్వం.. త్వరలో దీన్ని రూ.2,000కు పెంచాలని భావిస్తోంది. దానికి తగ్గట్లుగా రూ.1200 కోట్లు చూపించింది.
- పేదలకు మూడు పూటలా ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించేందుకు కేటాయింపుల్ని రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లకు పెంచింది
- అసంఘటిత రంగంలోని కార్మికులు ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబాల్ని ఆదుకునేందుకు ఉద్దేశించిన చంద్రన్న బీమాకు రూ.140 కోట్ల నుంచి రూ.354.02 కోట్లకు పెంచారు
- వైశ్య కార్పొరేషన్‌కి రూ.30 కోట్ల నుంచి రూ.50 కోట్లకు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కి రూ.75 కోట్ల నుంచి 100 కోట్లకు, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి రూ.75 కోట్ల నుంచి 100 కోట్లకు కేటాయింపుల్ని పెంచారు
- వివిధ వెనుకబడిన వర్గాలకు చెందిన వధువులకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందించే చంద్రన్న పెళ్లికానుకకు నిధులను రూ.132.22 కోట్లకు ప్రభుత్వం పెంచింది

లెక్కప్రకారం చూస్తే, ఏపీ బడ్జెట్ (తెలంగాణ బడ్జెట్ కూడా) భారీ సినిమానే చూపించిందనుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు 2019-20 సంవత్సరానికి శాసనసభలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

ఓటర్లను ఆకట్టుకోవటమే లక్ష్యంగా, జనాకర్షక తాయిలాలకు ప్రాధాన్యమిస్తూ ఏపీ ప్రభుత్వం 'ఎన్నికల పద్దు'ను రూపొందించింది. ఇటీవలికాలంలో అధికారికంగా

### పంచాయతీరాజ్, గ్రామీణకు పెద్దపీట

నారా లోకేష్ మంత్రిగా ఉన్న పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖకు నిధులు 50.10 శాతం మేర పెరిగాయి. ఈ శాఖకు రూ. 31,208.82 కోట్లు ఇచ్చారు. గ్రామాలను.. సిమెంట్ రోడ్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ, ఇంటింటికీ కుళాయి నీరు వంటి మౌలిక వసతులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. వ్యవసాయం, అనుబంధ రంగాలకూ కేటాయింపులు ఎక్కువ చేసింది. వ్యవసాయ, మార్కెటింగ్ రంగాలకు రూ. 12,732.97 కోట్లు (26.10 శాతం పెంపు), అనుబంధ రంగాలకు రూ. 1743.02 కోట్లు (16.62 శాతం పెంపు), కార్మిక, ఉపాధి కల్పన శాఖకు రూ. 1225.75 కోట్లు (50.43 శాతం పెంపు) కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే 20 శాతం కంటే పెంచిన శాఖల్లో.. వెనుకబడిన తరగతుల సంక్షేమం (32 శాతం), ఆర్థిక (20 శాతం), సాధారణ పరిపాలన (45.56 శాతం), పరిశ్రమలు-వాణిజ్యం (33.82 శాతం), ప్రణాళికా విభాగం (26.96 శాతం), రెవెన్యూ శాఖ (33.66 శాతం)లు ఉన్నాయి. నైపుణ్యాభివృద్ధి సంస్థకు 10.72 శాతం తగ్గించారు.

**ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ స్వరూపం (రూ.కోట్లలో)**

| | 2017-18 | 2018-19 (బ.అం) | 2018-19 (స.అం) | 2019-20 (బ.అం) |
|---|---|---|---|---|
| **1) రెవెన్యూ వసూళ్లు** | 1,05,062 | 1,55,507 | 1,56,364 | 1,78,269 |
| ఎ) పన్ను ఆదాయం | 49,812 | 65,535 | 67,535 | 75,437 |
| బి) పన్నేతర ఆదాయం | 3,813 | 5,346 | 5,346 | 5,750 |
| సి) కేంద్ర పన్నుల్లో వాటా | 28,674 | 33,929 | 32,787 | 36,360 |
| డి) గ్రాంట్లు | 22,760 | 50,695 | 50,695 | 60,721 |
| **2) మూలధన వసూళ్లు** | 86,888 | 35,552 | 39,363 | 47,435 |
| **3) మొత్తం వసూళ్లు** | 1,91,950 | 1,91,059 | 1,95,727 | 2,25,705 |
| **4) రెవెన్యూ వ్యయం** | 1,21,213 | 1,50,271 | 1,58,858 | 1,80,369 |
| **5) మూలధన వ్యయం** | 13,490 | 28,678 | 25,021 | 29,596 |
| **6) రుణాలు, వడ్డీ చెల్లింపు** | 55,089 | 10,851 | 10,942 | 14,917 |
| **7) మొత్తం వ్యయం** | 1,92,574 | 1,91,063 | 1,96,948 | 2,26,177 |
| **8) రెవెన్యూ లోటు** | -16,151 | 5,235 | -2,494 | -2,099 |
| **9) ద్రవ్య లోటు** | -32,372 | -24,205 | -29,141 | -32,390 |

ప్రకటించిన, అనధికారికంగా వెల్లడించిన పథకాలకు భారీ కేటాయింపులు చేసింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి కూడా నిధుల్ని పెంచింది. ఎన్నికల కోడ్ వచ్చినా ఇబ్బంది లేకుండా, మార్చి నెలలో లేదా ఏప్రిల్ మొదటివారంలో ఇప్పటికే ప్రకటించిన పథకాలు అమలు చేసేందుకు వీలుగా నిధులు కేటాయించారు. సంక్షేమం పేరుతో ఇప్పటికే అమల్లో ఉన్న ఇతర పథకాలను విస్తరించారు. కేటాయింపులు పెంచారు. సామాజిక పింఛన్ల కింద ఇస్తున్న మొత్తాన్ని రెట్టింపు చేశారు. డ్వాక్రా మహిళలకు పసుపు-కుంకుమ కింద రూ. 10,000 చొప్పున ఆర్థికసాయం వంటి సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

వివిధ వర్గాలకు ఆరు కొత్త సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో 86 లక్షలకుపైగా ఉన్న రైతులను

### రుణభారం

ఆర్థిక నిర్వహణ ప్రక్రియ బడ్జెట్ వనరులను మించి ఉండటంతో వివిధ జాతీయ బ్యాంకుల నుంచి పలు కార్పొరేషన్ల ద్వారా రుణాలు సేకరిస్తున్నారు. మొత్తం 13 కార్పొరేషన్ల ద్వారా రూ. 35,768 కోట్లు కిందటి సంవత్సరమే తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 2014-15 రెవెన్యూలోటు ఇంకా భర్తీ కాకపోవటం, పలు చెల్లింపులు జరగకపోవటం, పథకాలు పెరిగిపోవటం, సేవారంగం బలహీనంగా ఉండటంతో రుణాలు కూడా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం జీతాలు, పెన్షన్లకే రూ. 60,000 కోట్లకుపైగా చెల్లించాల్సి వస్తోంది. 2014-15లో రుణం రూ. 1,48,743.45 కోట్లు ఉండగా, 2018-19 (అంచనా)లో రూ. 2,49,435.37 కోట్లుగా ఉంది.

ఆకట్టుకోవటానికి రూ. 5,000 కోట్లతో 'అన్నదాతా-సుఖీభవ' పథకాన్ని తీసుకువచ్చింది. ఎన్నికలకు ముందే దీనిని అమల్లోకి తెచ్చే ఉద్దేశంతో నిధులకు ఇబ్బంది లేకుండా కేటాయింపులు చేసింది. ఆటోడ్రైవర్లకు జీవితకాల పన్ను, ట్రాక్టర్లకు త్రైమాసిక పన్ను ఇటీవలే రద్దు చేసిన ప్రభుత్వం.. వారిని మరింతగా ఆకట్టుకునేందుకు రూ. 150 కోట్లతో 'డ్రైవర్ల సాధికార సంస్థ'ను ఏర్పాటు చేసింది.

'పసుపు-కుంకుమ' పథకానికి గత బడ్జెట్‌లో రూ. 1700 కోట్లు కేటాయించగా.. ఈసారి దానిని రూ. 4,000 కోట్లకు (135.29 శాతం) పెంచింది. ఈ పథకం కింద డ్వాక్రా మహిళలకు రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని మూడు విడతలుగా అందిస్తోంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వంటి వారిని ఆదుకునేందుకు సామాజిక పింఛన్లను రెట్టింపు చేసిన ప్రభుత్వం కేటాయింపులను రూ. 12,819.18 కోట్లకు పెంచింది.

### రెవెన్యూలోటు రూ.2,099 కోట్లు

ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ. 2,26,177.53 కోట్లతో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2018-19 బడ్జెట్ అంచనాల కంటే ఇది రూ. 35,113 కోట్లు అధికం. 2014-15 నుంచి ఏటా సగటున రూ. 15,000 కోట్లు చొప్పున కేటాయింపులు పెరుగుతుండగా, 2018-19లో ఒక్కసారిగా రూ. 34,064.21 కోట్లకు పెంచారు. రెవెన్యూ వ్యయాన్ని రూ. 1,80,369 కోట్లుగా.. మూలధన వ్యయాన్ని రూ. 29,596 కోట్లుగా పేర్కొన్నారు. రుణాల చెల్లింపునకు రూ. 14,917 కోట్లను చూపించారు. 2018-19 సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ. 2,494.12 కోట్ల రెవెన్యూ లోటు చూపించగా, ఈసారి రూ. 2,099 కోట్లుగా అంచనా వేశారు. 2018-19 సవరించిన అంచనాల ప్రకారం ద్రవ్యలోటు రూ. 29,141.72 కోట్లు. ఈసారి అది రూ. 32,391 కోట్లకు పెరిగింది. రాష్ట్రానికి సమకూరే ఆదాయంలో.. కేంద్ర పన్నుల్లో వాటాల రూపంలో రూ. 36,360 కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ. 60,721 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయ వనరుల నుండి రూ. 75,438 కోట్లు వస్తాయని అంచనా వేశారు. స్థూల రాష్ట్రోత్పత్తి (జీఎస్‌డీపీ) రూ. 10,67,990 కాగా, ఇందులో రెవెన్యూ లోటు 0.20 శాతంగా, ద్రవ్య లోటు 3.03 శాతంగా ఉంది.

బడ్జెట్‌లో తొలి నాలుగు నెలల కాలానికి రూ. 76,816.85 కోట్లకు ఓట్ ఆన్ అకౌంట్‌గా తేల్చారు. ఇందులో రూ. 65,869.23 కోట్లను ప్రభుత్వ శాఖలు తొలి నాలుగు నెలల కాలానికి చేసే ఖర్చుగా అంచనా వేశారు. ✧

### ఏ రంగానికి ఎంత? (రూ.కోట్లలో)

వ్యవసాయం : 12,732.97
జలవనరులు : 16,852.27
పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి: 35,182.61
వైద్య ఆరోగ్యం : 10,022.15
సెకండరీ విద్య : 22,783.37
ఉన్నత విద్య : 3,271.63
గృహనిర్మాణం : 4,079.10
బీసీ సంక్షేమం : 24,468.64
(ఉప ప్రణాళిక : 14,367, సంక్షేమానికి: 8,242.64)
సాంఘిక సంక్షేమం: 21,228
(ఉప ప్రణాళిక : 14,367, సంక్షేమానికి: 6,861)
మహిళ, శిశు సంక్షేమం : 3,408.66
మైనార్టీల సంక్షేమం : 1,308.73
పురపాలక-పట్టణాభివృద్ధి : 7,979.34
రహదారులు, భవనాలు : 5,382.83
గిరిజన ఉప ప్రణాళిక : 5,385

# గెలిపించిన పథకాల ఫార్ములాతోనే తెలంగాణ బడ్జెట్ 2019




తెలంగాణకు 2019–20 ఆర్థిక సంవత్సరానికి 1,82,017 కోట్ల బడ్జెట్‌ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు శాసనసభలో ప్రవేశపెట్టారు. ఇది ఆరు నెలల కాలానికి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కావడంతో ఇందులో సగం మొత్తానికి (రూ.91,008 కోట్లు) ద్రవ్యవినిమయ బిల్లును అసెంబ్లీ ఆమోదించింది.

సాగునీటి రంగానికి కేటాయింపులు, పింఛన్లు, భృతులతో కూడిన సంక్షేమం, రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ వంటివి తనను ముందస్తు ఎన్నికల్లో ఇంత గెలిపించాయని నమ్ముతున్న కేసీఆర్.. బడ్జెట్‌లో దాదాపు సగం నిధులను వీటికే కేటాయించారు. కులాలవారీ గుర్తింపుతోనే అయినా బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి తాము కట్టుబడి ఉన్నామని చాటేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. రాష్ట్రంలో రెండోసారి కూడా అధికారంలోకి రావటంతో.. తమ కార్యక్రమాలను పూర్తి చేసేందుకు, విస్తరించేందుకు కేసీఆర్ సర్కారు బడ్జెట్ పద్దుల ద్వారా ప్రయత్నం చేసింది.

మొత్తం బడ్జెట్: రూ.1,82,017 కోట్లు

నిర్వహణ పద్దు: 1,31,629 కోట్లు

ప్రగతి పద్దు: 32,815 కోట్లు

రుణాలు, అడ్వాన్స్‌ల చెల్లింపు: 17,573 కోట్లు

దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ రాష్ట్రం అనతికాలంలోనే దేశానికి తలమానికంగా నిలిచిందని కేసీఆర్ ఈ సందర్భంగా అన్నారు. అనేక ప్రతికూలతలను అధిగమించి.. సామాజిక, ఆర్థిక పునాదులను పటిష్ఠం చేసుకుంటూ దేశానికి ఆదర్శంగా నిలువడం అద్భుతమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నిటినీ కొనసాగిస్తూనే, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త కార్యక్రమాలను ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. “నిన్నటిదాకా గుజరాత్, కేరళ లాంటి రాష్ట్రాల అభివృద్ధి నమూనా గురించే చర్చ జరుగుతుండేది. నేడు, వాటి స్థానంలో తెలంగాణ మోడల్ గురించి చర్చ జరుగుతోందంటే, మనందరి హృదయం గర్వంతో ఉప్పొంగుతుంది” అన్నారు. ఇవాళ రాష్ట్రంలో ప్రభుత్వ ప్రగతి, సంక్షేమ ఫలాలు అందుకోని కుటుంబమేదీ రాష్ట్రంలో లేదనడం అతిశయోక్తి కాదన్నారు.

వ్యవసాయ రుణాల మాఫీ, రైతు బంధు కింద ఎకరాకు రూ.10,000, ఆసరా పింఛన్ల మొత్తం రెట్టింపు, నెలకు రూ.3,016 నిరుద్యోగభృతికి బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు.

- 1.42 కోట్ల ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా ముందుకు వెళ్తున్న ప్రభుత్వం ఈ ఏడాది ఈ రంగానికి రూ.22,500 కోట్లతో ప్రాధాన్యాన్ని కొనసాగించింది.
- మొదటి ఐదేళ్లలో రూ.16,124 కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేసిన సర్కారు.. మరోమారు రుణమాఫీకి బడ్జెట్‌లో నిధులను నిర్దేశించింది. లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేయడానికి వీలుగా ఆరువేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

| తెలంగాణ బడ్జెట్ సమగ్ర స్వరూపం 2019-20 బడ్జెట్ అంచనాలు | |
|---|---|
| వివరం | రూ. కోట్లలో |
| **1. ప్రారంభ నిల్వ** | 109.50 |
| **2. రెవెన్యూ రాబడులు** | 1,38,193.89 |
| ఎ) కేంద్ర పన్నుల్లో వాటా | 20,583.05 |
| బి) పన్ను ఆదాయం | 84,814.67 |
| సి) పన్నేతర ఆదాయం | 9,960.87 |
| డి) గ్రాంట్లు | 22,835.30 |
| **3. మూలధన వసూళ్లు** | 43,865.17 |
| ఇ) బహిరంగ మార్కెట్ రుణాలు | 31,158.00 |
| ఎఫ్) స్వల్పకాలిక రుణాలు | 100.00 |
| జి) కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు | 800.00 |
| హెచ్) ఇతర రుణాలు | 1500.00 |
| ఐ) డిపాజిట్లు, లావాదేవీలు (నికరం) | 2,500.00 |
| జె) రుణాలు, అడ్వాన్సులు | 7,807.17 |
| కె) ఇతర రాబడులు | ........ |
| ఎల్) కంటింజెన్సీ నిధి | ........ |
| **4. మొత్తం రాబడులు** | 1,82,059.06 |
| **5. మొత్తం వ్యయం** | 1,82,016.84 |
| ఎం) రెవెన్యూ వ్యయం | 1,31,629.40 |
| ఎన్) ఇందులో వడ్డీ చెల్లింపులు | 12,808.00 |
| ఓ) మూలధన వ్యయం | 32,815.40 |
| పి) రుణాలు, అడ్వాన్సులు | 9,305.05 |
| క్యు) ప్రభుత్వ రుణ చెల్లింపులు | 8,266.99 |
| **6. రెవెన్యూ మిగులు (2-ఎం)** | 6,564.49 |
| **7. ద్రవ్యలోటు** | -27,748.79 |
| **8. ప్రాథమిక లోటు** | -14,940.79 |

- రైతుబంధు ద్వారా రైతులకు ఎకరాకు రెండు వేల రూపాయలను పెంచి రూ.10వేలు ఇవ్వడానికి వీలుగా బడ్జెట్‌లో కేటాయింపులు (రూ.12,000 కోట్లు) చేసింది.
- సంక్షేమ రంగానికి మరోమారు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. ఎస్.సి, ఎస్.టి, బీసీ, మైనారిటీ సంక్షేమానికి బడ్జెట్‌లో 16 శాతం నిధులను ప్రతిపాదించింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు ప్రాధాన్యతను కొనసాగించింది. 5 లక్షల మందికి పైగా ప్రయోజనం పొందేలా కేటాయింపులు చేశారు.
- ఉద్యోగాల భర్తీని కొనసాగిస్తూనే నిరుద్యోగులకు అండగా నిలుస్తామని ప్రభుత్వం తెలిపింది. సుమారు ఐదు లక్షల మంది నిరుద్యోగులకు నెలకు రూ.3,016 చొప్పున భృతి ఇచ్చేందుకు (రూ.1810 కోట్లు కేటాయింపు) మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు చెప్పింది.

### రుణాలపైనే భారం

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సాగుప్రాజెక్టులకు అవసరమైన నిధుల సమీకరణలో ప్రభుత్వం ఎక్కువగా రుణాలపైనే ఆధారపడింది. ప్రస్తుత ఏడాది (2018-19) చేసిన వ్యయం కూడా ఎక్కువగా బ్యాంకుల నుంచి రుణాల పేరిట సర్దుబాటు చేసింది. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో పెట్టబోయే వ్యయం కూడా ఎక్కువగా బ్యాంకుల నుంచే సర్దుబాటు చేయటానికి ప్రణాళికను రూపొందించారు.

- 40 లక్షలమంది ఆసరా పింఛనుదారులకు పింఛను రెట్టింపు చేసింది. గత బడ్జెట్‌లో ఆసరా పింఛన్లకు రూ. 5,366 కోట్లు కేటాయించగా, ఈసారి ఈ మొత్తాన్ని రూ. 12,067 కోట్లకు పెంచింది. ఆసరా పింఛను తీసుకునే వయోపరిమితి ప్రస్తుతం 65 సంవత్సరాలు ఉండగా, దీన్ని 57 సంవత్సరాలకు తగ్గించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. దీనివల్ల మరో 10 లక్షలమంది పేదలకు ప్రయోజనం చేకూరనుంది.
- రెండు పడకల ఇళ్ల నిర్మాణాన్ని మరింత విస్తృతం చేయనుంది.

### ఆర్థిక స్థితి పటిష్టంగా ఉంది

రాష్ట్రం పన్నుల రాబడిని పెంచుకుంటూ ఆర్థికంగా పటిష్ట స్థితిలో ఉందని ముఖ్యమంత్రి ప్రకటించారు. 2018-19లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) 8,66,875 కోట్లుగా అంచనా వేశారు. జీఎస్‌డీపీలో 15 శాతం వృద్ధి రేటును నమోదు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 2016-17లో 14.2 శాతం, 2017-18లో 14.3 శాతం వృద్ధి రేటు ఉంటుందన్నారు. ఇదే సమయంలో దేశ వృద్ధి రేటు 12.3 శాతం మాత్రమేనన్నారు. సమైక్య రాష్ట్రంలో చివరి రెండేళ్లలో దేశ వృద్ధి రేటు కంటే వెనుకబడి ఉన్నామన్నారు. పారిశ్రామిక, ఉత్పత్తి రంగాల్లో 2018-19లో ప్రస్తుత ధరల్లో 14.9 శాతం వృద్ధి రేటు నమోదయ్యే అవకాశం ఉందని, సేవారంగంలో 15.5 శాతం వృద్ధి రేటు ఉందని వివరించారు. రాష్ట్ర తలసరి ఆదాయంలో వృద్ధి రేటు 13.8 శాతంగా ఉందని, ఇది జాతీయ వృద్ధి రేటు కంటే 8.6 శాతం ఎక్కువని అన్నారు. 2017-18లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 1,81,102 కాగా, 2018-19లో రూ. 2,06,107కు చేరుకుంటుందన్నారు.

### సంక్షేమ శాఖలకు రూ.29,507.45 కోట్లు

షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి రూ. 14,005.46 కోట్లు, షెడ్యూల్డ్ తెగలకు రూ. 8,970.06 కోట్లు, వెనుకబడిన తరగతులకు రూ. 4,528.01 కోట్లు, మైనారిటీలకు రూ. 2003.92 కోట్లు కేటాయించారు.

### మూలధన వ్యయంలో నెంబర్‌వన్

ఆర్థిక క్రమశిక్షణ, అవినీతి నిరోధానికి విధానాల అమలుతో రాష్ట్రం స్వీయ రాబడుల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదటి నాలుగేళ్లలో 17.17 శాతం వార్షిక సగటు వృద్ధి రేటు నమోదు చేసిందని తెలిపింది. మూలధనం వ్యయంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని వెల్లడించింది. 2016-17 లెక్కల ప్రకారం, రాష్ట్రం మొత్తం వ్యయంలో మూలధన వ్యయం 28.2 శాతం ఉన్నదని ముఖ్యమంత్రి చెప్పారు. ఉమ్మడి ఏపీలోని మొత్తం 23 జిల్లాలకు కలిపి 2004-05 నుంచి 2014 వరకు మూలధన వ్యయం రూ. 1,29,683 కోట్లుంటే.. తెలంగాణలోని పది జిల్లాలకు చేసినది రూ. 54,052 కోట్లు మాత్రమేనన్నారు. కానీ 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో రూ. 1,68,913 కోట్ల మూలధన వ్యయం చేసినట్లు తెలిపారు.

### సవరించిన అంచనాల ప్రాతిపదికగా బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం 2019-20 బడ్జెట్ అంచనాలను వాస్తవవ్యయం ప్రాతిపదికగా రూపొందించింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఏటా అంతకుముందు సంవత్సరం అంచనాల కంటే 12 శాతం పైగా పెంపుదలతో బడ్జెట్‌లను ప్రవేశపెట్టింది. ఈసారి మాత్రం భిన్నంగా వ్యవహరించింది. వాస్తవవ్యయంతో పాటు సవరించిన అంచనాలను ప్రాతిపదికగా చేసుకుని 2018-19 అంచనాల కంటే 4.4 శాతం పెరుగుదలతో ప్రతిపాదించింది. ఈసారి రూ. 1.82 లక్షల కోట్ల బడ్జెట్‌కు పరిమితమైంది. 2018-19 సంవత్సరం బడ్జెట్ రూ. 1.74 లక్షల కోట్లు కాగా, దీన్ని రూ. 1.61 లక్షల కోట్లకు సవరించింది. ఈ నేపథ్యంలో 2019-20 బడ్జెట్‌ను సవరించిన అంచనాల కంటే 12.4 శాతం పెంపుదలతో ప్రతిపాదించింది. ✧



లోక్‌సత్తా భావజాలాన్ని అభిమానించే సినీ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రీకి ఇటీవల 'పద్మ పురస్కారం' లభించటం పట్ల లోక్‌సత్తా వర్గాలు సంతోషాన్ని వ్యక్తం చేశాయి. జేపీ ఫోన్‌లో తన అభినందనల్ని తెలియజేయగా, లోక్‌సత్తా పార్టీ నేతలు సీతారామశాస్త్రిని హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో కలిసి శుభాకాంక్షల్ని తెలిపారు.

# ధర్మం వైపు నిలబడండి.... లోక్‌సత్తా వైపు నిలబడండి !

....ధర్మాన్ని రక్షించడమంటే గుడికెళ్లి కొబ్బరికాయ కొట్టడం మాత్రమే కాదు, మసీదులో, చర్చిలో, గురుద్వారాలో ప్రార్థనలు చేయడం మాత్రమే కాదు... మనం ధర్మం వైపు నిలబడాలి...

లోక్‌సత్తా తనకెంత బలముంది అని ఆలోచించి పోరాటం మొదలుపెట్టలేదు

దేశానికి అవసరం కాబట్టి పోరాటం మొదలుపెట్టింది

నిజమే

లోక్‌సత్తా నోట్లు పెట్టి ఓట్లు కొనదు...

కానీ మీ ఓటుకు అన్ని పార్టీలకన్నా ఎక్కువ విలువ తీసుకురాగల సత్తా ఉంది...

నల్లడబ్బుతో బహిరంగసభలకి లక్షల జనాన్ని తరలించదు...

కానీ.... కోట్లమందికి... నిజాలని నిర్భయంగా చెప్పే శక్తి ఉంది...

ఓట్లకోసం జనాన్ని రెచ్చగొట్టడానికి, చిచ్చుపెట్టడానికి, మభ్యపెట్టడానికి సొంత ఛానళ్లు, పత్రికలు లేవు.

కానీ, మన ప్రతి సమస్యకి పరిష్కారం చూపే సత్తా ఉంది... ఆలోచించండి...

ధర్మం వైపు నిలబడండి... లోక్‌సత్తా వైపు నిలబడండి...

(2014 ఎన్నికల సమయంలో సీతారామశాస్త్రి తెలుగు ప్రజలకు రాసిన బహిరంగ లేఖలోని కొన్ని వాక్యాలు)

Posting Date 07-03-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on March 1st 2019

## A MOMENT OF PRIDE

Foundation for Democratic Reforms has been featured in 2018 Global Go to Think Tank Index by the University of Pennsylvania as one of the leading think-tanks in seven categories



# Top Think Tanks

- In China, India, Japan and the Republic of Korea
- Domestic Health Affairs
- Education Policy
- Social Policy

FDR's efforts in all its key focus areas of public policy have been acknowledged



**Top think tank for :**

- Most Innovative Policy Ideas,
- Best Advocacy Campaign, and
- Most Significant Impact on Public Policy

Special Achievements Category

FDR's work is primarily to identify and push the critical levers of change so that our democracy can really deliver results to the citizens

| Book-Post | To |
|---|---|
| PRINTED MATTER<br>If not delivered please return to:<br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad